
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5


తిరుపతి
జిల్లా వార్తలు
శనివారం 20 జూలై 2024

తెలుగు సాహితీ లోకానికి తీరని వెలితిని మిగిల్చి ప్రసిద్ధ కవి అడిగోపుల వెంకటరత్నం శుక్రవారం తిరుపతిలో కన్నుమూశారు. దళిత స్పృహ, అభ్యుదయ భావజాలంతో యాభై ఏళ్లుగా ఆయన నిరంతరాయంగా కవిత్వం రాశారు. ఆయన కవిత్వం అచ్చుకాని పత్రిక ఏదీ తెలుగు నేలమీద లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతి పరిణామాన్నీ నిశితంగా గమనిస్తూ కవిత్వ రూపంలో స్పందించడం ఆయన ప్రత్యేకత.
- తిరుపతి (విశ్వవిద్యాలయాలు)



తెలుగు కవిత్వంలో నిలువెత్తు సంతకం

అడిగోపుల వెంకటరత్నంకు నివాళి

నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం కొత్తవంగల్లు అడిగోపుల వెంకటరత్నం పుట్టిన ఊరు. నాగార్జున యూనివర్సిటీలో ఇంజనీరుగా చేస్తూనే కవిత్వం విరివిగా రాసేవారు. రిటైరయ్యాక తిరుపతిలో స్థిరపడ్డారు. భార్య పద్మజ, కుమార్తెలు మాధవి, శాంతి, కుమారుడు శ్రీకాంత్ ఉన్నారు.విదేశాల్లో ఉన్న కుటుంబ సభ్యులు వచ్చాక ఆయన చివరి కోరిక ప్రకారం స్వస్థలం కొత్తవంగల్లులో ఆదివారం అంత్యక్రియలు నిర్వహిస్తారు.

అడిగోపుల కవితా సంపుటాలు

సూర్యోదయం, ఎన్నాళ్లీ చరిత్ర, పురోగతి అంచున, జీవన పోరాటం, బానిసత్వం అమ్మబడును, మరణానికి రెండు ముఖాలు, విప్లవానికి పురిటిగడి, ఆకాశవీధిలో అగ్నిగానం, యుద్ధమంటే మాకు భయం లేదు, మట్టి మౌనం వహించదు, మహాపథం, రాతి చిగుళ్ళు, అదృశ్యకుడ్యం, సంకెళ్ళు తెగిన చప్పుళ్ళు, శ్వేతపత్రం, విశ్వగీతం, రంగుల చీకటి, రేపటి వర్తమానం, రెక్కవిప్పిన రాగం, రేపటి జ్ఞాపకం, ముందడుగు, పదండి ముందుకు, కాలం నా చేతిలో ఉంది, జయభేరి, కొత్తగాలి, నిలువెత్తు సంతకం.

అందుకున్న అవార్డులు

కుందుర్తి పురస్కారం, శ్రీశ్రీ అవార్డు, తానా అవార్డు, కరుణశ్రీ అవార్డు, వాసిరెడ్డి - సుంకర అవార్డు, తెలుగు వర్సిటీ పురస్కారం, రాష్ట్ర ప్రభుత్వ కవిరత్న అవార్డు, రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారం, గిడుగు పురస్కారం, నూతలపాటి కవితా పురస్కారం, కొలకలూరి భాగీరథి పురస్కారం, ఉమ్మడిశెట్టి పురస్కారం, గార్లపాటి సిద్దమనాయుడు పురస్కారం, విశాలాక్షి సాహిత్య పురస్కారం.

"నిన్నటి మొన్నటి జ్ఞాపకం.. వర్తమానంలో ఉంటుంది.. నేటి జ్ఞాపకం, రేపటి జ్ఞాపకం.. భవిష్యత్తులో ఉంటుంది... నా అంటరానితనం దూరంగా కూర్చొన్న జ్ఞాపకం.. ఇది గతం. రేపు నేను మరణించాక అంటరానితనం వెంటబడి ఊరిదారి అనుమతించక ఊరిబయటే ఉంటుంది.. నా శవప్రస్థానం... నా రేపటి జ్ఞాపకం కాకూడదు." అని తన కవిత్వంలో విస్పష్టంగా ప్రకటించిన కవి అడిగోపుల వెంకటరత్నం. "మల్లెచెట్టు కింద మల్లెతీగలం.. ఎదుగూ బొదుగూ లేని వాళ్ళం.." అంటూ తెలుగు కవిత్వంలో దళిత జీవితంలోని దైన్యాన్ని అనేక దశాబ్దాల క్రితమే వినిపించిన కవి ఈయన. ఆరుద్ర, ఆత్రేయ, రావూరి భరద్వాజ, సినారె, రాచపాళెం, సంజీవ్ దేవ్, గుంటూరు శేషేంద్రశర్మ, పెద్దిబొట్ల సుబ్బరామయ్య, రావిశాస్త్రి, వంటి ప్రముఖుల చేత ప్రశంసలు పొందిన కవి అడిగోపుల వెంకటరత్నం. కుమారుడు శ్రీకాంత్ చిత్రకారుడిగా గుర్తింపు పొందారు. అడిగోపుల కవితా సంపుటాలకు కుమారుడు రూపొందించిన చిత్రాలనే ముఖచిత్రాలుగా ముద్రించుకున్నారు. అడిగోపుల కవిత్వంపై శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీ తెలుగు విభాగంలో ఎన్. భీమన్న పరిశోధన చేశారు. ఆంధ్రా యూనివర్సిటీలో పద్మకుమారి పరిశోధన చేశారు. నాగార్జున యూనివర్సిటీలో అడిగోపుల కథలపై త్రివిక్రమ సూరి ఎంఫిల్ చేశారు.



టైగర్ రొయ్యకు వైట్‌స్పాట్

● వైరస్ సోకి లక్షల్లో చనిపోతున్న పిల్లలు ● లబోదిబోమంటున్న ఆక్వా రైతులు

నిన్న మొన్నటి వరకు వెనామీ రొయ్యల సాగులో లక్షల నుంచి కోట్ల రూపాయలతో నష్టపోయిన ఆక్వా రైతులకు మళ్లీ ఎదురుదెబ్బ తగిలింది. వెనామీతో వచ్చిన నష్టాలను టైగర్ రొయ్యల సాగుతోనైనా పూడ్చుకుందామనుకున్న వారికి మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టయ్యింది. వాతావరణంలో మార్పులు కారణంగా గుంటల్లోని రొయ్య పిల్లలకు వైట్‌స్పాట్ వైరస్ సోకుతోంది. వేల నుంచి లక్షల్లో పిల్లలు చనిపోతూ ఒడ్డుకు కొట్టుకొస్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు.
- కోట

సముద్ర తీర ప్రాంత మండలాలైన కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరుల్లో రెండేళ్ల నుంచి ఆక్వా రైతులు వెనామీ సాగుకు స్వస్తి పలికారు. టైగర్ రొయ్యల సాగును చేపట్టి ఉన్నారు. మొదట్లో టైగర్ రొయ్యలకు ఎలాంటి సమస్యలు రాకుండా లాభాలను తెచ్చిపెట్టింది. దాంతో చాలామంది రైతులు టైగర్‌సాగును చేపట్టారు. పుదుచ్చేరి, చెన్నై, కేరళవంటి ప్రాంతాల నుంచి రొయ్యల ఫీడ్‌ను తీసుకోకుండా ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి తీసుకొచ్చి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం టైగర్ రొయ్య పిల్లలను గుంటల్లో వదిలిన 30 రోజుల తర్వాత అవి వైట్‌స్పాట్ వైరస్ బారి నపడి చనిపోతున్నాయి. ప్రధానంగా కోట మండలం సిద్ధవరం, కర్లపూడి, గోవిందపల్లి, గోవిందపల్లిపాళెం, దొరువుకట్ట గ్రామాల్లో ఎక్కువగా వైరస్ సోకి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

వాతావరణంలో మార్పులూ కారణమే..

వారం రోజులుగా వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయి. ఆకాశం మేఘావృతం కావడం, చల్లటి వాతావరణం ఉండటం కూడా వైట్‌స్పాట్ వైరస్ రావడానికి కారణమంటున్నారు రైతులు. దీనివల్ల గుంటల్లో నీటి ఉష్ణోగ్రత 16 డిగ్రీల కంటే తగ్గడం ప్రధాన కారణంగా టెక్నీషియన్లు చెబుతున్నారు.


చనిపోయిన రొయ్యలు

లక్షణాలిలా..

వైట్ స్పాట్ వైరస్ సోకిన రొయ్యపిల్లల మొప్పల్లో తెల్లటి మచ్చలు ఏర్పడతాయి. తర్వాత రొయ్యపిల్లలు క్రమేపీ మేత (ఫీడ్) తినడం మానేస్తాయి. రోజురోజుకూ బలహీనపడి చనిపోతాయి.

చెవిరెడ్డీ.. డైవర్షన్ పాలిటిక్స్

మానుకో..!

- పెద్దిరెడ్డితో మాకు ఎలాంటి సంబంధాలు లేవు
- అవసరమైతే కాణిపాకంలో ప్రమాణం చేస్తా
- నా కార్యకర్తల జోలికొస్తే ఊరుకునేది లేదు
- చెవిరెడ్డిని రాజకీయ సమాధి చేస్తా
- చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆగ్రహం


తన కాలు వాపు ఇంకా తగ్గలేదని మీడియాకు చూపుతున్న పులివర్తి నాని

తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): 'మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డితో మాకు ఎలాంటి లావాదేవీలు లేవు. యాదృచ్ఛికంగా రెండే సార్లు ఎయిర్‌పోర్టులో కలసినప్పుడు పలకరించడం తప్ప. నేను కానీ నా కుటుంబసభ్యులు కానీ ఆయనకు ఫోన్ చేసినా, కలిసి మాట్లాడినట్టు నిరూపించినా కాణిపాకంలో ప్రమాణం చేస్తా. చెవిరెడ్డీ.. డైవర్షన్ పాలిటిక్స్ మానుకో' అంటూ చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని స్పష్టం చేశారు. పులివర్తినానీపై చెవిరెడ్డి మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఎమ్మెల్యే నాని ఘాటుగా ప్రతిస్పందించారు. 'పెద్దిరెడ్డితో తన భార్య కుటుంబానికి బంధుత్వం ఉన్నమాట వాస్తవమేనంటూ.. ఎర్రావారిపాళెం కరుణాకర్‌రెడ్డి ఇరు కుటుంబాలకు బంధువైనా తమకు వ్యతిరేకంగా పనిచేశారని తెలిపారు. 'మా కార్యకర్తలపై మీరు దాడులు చేశారు. రాజకీయంగా ఎదిగే నాలాంటి వ్యక్తిపై నిందలు వేయద్దు. నిన్ను రాజకీయ సమాధి చేసేవరకు నేను బతికే ఉంటా.' అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. 'నేను గెలిచిన తర్వాత శ్రీవారికి మొక్కుబడి తీర్చుకోలేని పరిస్థితి నీవల్లే వచ్చింది. నా ఆరోగ్యం సహకరించక నడిచి వెళ్లలేక పోయా. నటించాల్సిన అవసరం లేదు. ఇప్పటికీ నాకాలు వాపు తగ్గలేదు. నా కార్యకర్తలను వాడు, వీడు అని మాట్లాడితే నేను సహనం కోల్పోవాల్సి వస్తుంది. నా కార్యకర్తలు దేవుళ్లతో సమానం. మీ కార్యకర్తలను కూడా నేను గౌరవిస్తా. ఉన్నది లేనట్టుగా.. లేనిది ఉన్నట్టుగా మాట్లాడవద్దు' అన్నారు. డైవర్షన్ రాజకీయాలు చేసినా దొంగ ఓట్లు అంశం, తమపై దాడి ఘటనలపై విచారణ జరిపించి తీరుతామని స్పష్టం చేశారు. తన క్వారీలకు రూ.49.5లక్షలు డిమాండు నోటీసు ఇచ్చారని, ఫ్యాక్టరీలకు నోటీసులు ఇచ్చారని, హైకోర్టుకెళ్లి ఇంటీరియం ఆర్డర్ తెచ్చుకున్నానని నాని వివరించారు. 'పెద్దిరెడ్డి కాదు కదా ఏ రెడ్డి కాళ్లూ నేను పట్టుకోను. కేవీఎస్ పేరుతో బోగస్ ట్రస్టు పెట్టి తప్పుడు లెక్కలు రాసి దోచేస్తున్నావు. కొవిడ్ సమయంలో పంపకాల ముసుగులో మఠం భూములు నొక్కేశావు' అని ఆరోపించారు. 'సీఆర్ రాజన్.. పెద్దిరెడ్డి మనిషని చెబుతున్నావు. మీతో నచ్చకనే ఆయన మా పార్టీలో చేరారు' అన్నారు.

భక్తజనసంద్రం


తపస్మాన్ చుట్టూ కిక్కిరిసిన భక్తులు

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు వైభవంగా జరిగింది. అర్జునుడి వేషధారి తపస్మాన్ పైనుంచి విసిరే నిమ్మకాయల కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.
- శ్రీకాళహస్తి

పులివర్తి నానీకి మా పెద్దిరెడ్డే గాడ్‌ఫాదర్

వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆయనకు వెన్నెముకలా నిలిచారు

టీడీపీ ఎమ్మెల్యే నానీపై చెవిరెడ్డి సంచలన ఆరోపణలు

తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీకి వైసీపీ పాలనలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెన్నెముకలా అండగా నిలిచారని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. శుక్రవారం తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'పులివర్తి నానీకి మా పార్టీ ముఖ్యనేత పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డే గాడ్ ఫాదర్' అని వ్యాఖ్యానించారు. అందుకే తాము అధికారంలో ఉన్న ఐదేళ్లు నాని క్వారీలు ఒక్క గంటైనా మూయలేదని చెప్పారు. ఆయన ట్రాన్స్‌పోర్ట్ కంపెనీని ఆపలేదు. నిబంధనలు పాటించకపోయినా స్టోన్ పాలిషింగ్ పరిశ్రమ జోలికెళ్లలేదని వివరించారు. నిబంధనలు పాటించకపోయినా సంబంధిత శాఖ మంత్రిగా పెద్దిరెడ్డి చర్యలు తీసుకుకోకపోగా, పాతమైనింగ్ కొనసాగిస్తూ అదనంగా మూడు హెక్టార్లు ఇచ్చారని చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఆరోపించారు. 'మా పార్టీ నేత ఎమ్మార్సీ రెడ్డిని వైసీపీ నుంచి సస్పెండ్ చేస్తే మావాళ్లెవరూ ఖండించలేదు కానీ, నాని ప్రెస్‌మీట్ పెట్టి మరీ ఖండించారు' అని గుర్తుచేశారు. వైసీపీతో ఆయనకు లోపాయికారీ ఒప్పందం ఏస్థాయిలో ఉందో వెల్లడవుతోందని అన్నారు. అదేవిధంగా పెద్దిరెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న సీఆర్ రాజన్, ఎన్నికల ముందు టీడీపీలో చేరి, నెల రోజులకే చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడి పదవిని పొందారు. మా పెద్దిరెడ్డి సన్నిహితుడికి పార్టీ పగ్గాలు అప్పగించి వైసీపీ నేతపై ఉన్న కృతజ్ఞతను నాని చాటుకున్నారని అన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో నాని అరాచకాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. 'ఎంతమందిపై దాడిచేస్తారో చేయండి. వడ్డీతోపాటు చెల్లిస్తా..' అని చెవిరెడ్డి హెచ్చరించారు.

సొంత రెవెన్యూ డివిజన్‌లో నో పోస్టింగ్

● తహసీల్దార్ల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ● జిల్లాకు రానున్న 42మంది

తిరుపతి(కలెక్టరేట్), జూలై19: ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలోని 42మంది తహసీల్దార్లను జోన్ 1, 2, 3, 4కు బదిలీ చేశారు. తాజాగా వీరంతా సొంత జిల్లాకు రావడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఈ మేరకు భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) ఆదేశిస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చింది. సీసీఎల్‌ఏ నుంచి కలెక్టర్లకు ఉత్తర్వులు అందగానే ఆయా జిల్లాల్లోని తహసీల్దార్లను సొంత జిల్లాకు పంపించనున్నారు.అయితే వీరికి సొంత రెవెన్యూ డివిజన్‌లో పోస్టింగ్ కేటాయించరాదని ఆదేశాల్లో ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. కాగా, వైసీపీతో అంటకాగిన పలువురు తహసీల్దార్లు తిరిగి ప్రధాన మండలాలకు రావడానికి అప్పుడే ఎన్డీఏ కూటమి నేతల వద్ద పైరవీలు చేస్తున్నట్లు తెలిసింది.

బాలిక హత్యాచారం కేసులో నిందితుడికి రిమాండ్

దొరవారిసత్రం, జూలై 19: దొరవారిసత్రం మండలంలో జరిగిన బాలిక హత్యాచారం కేసులో నిందితుడు దిలీప్‌కుమార్ సదాను శుక్రవారం పోలీసులు నెల్లూరు జైలుకు తరలించారు. బిహార్ రాష్ట్రంలోని బెహారి ప్రాంతానికి చెందిన దిలీప్‌కుమార్ సదా (20) రైసు మిల్లులో పనిచేసేందుకు వచ్చి ఈ దారుణానికి ఒడిగట్టిన విషయం తెలిసిందే. నిందితుడిని సూళ్లూరుపేట కోర్టులో హాజరు పరచడంతో మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు.


భక్తులను పలకరిస్తున్న అనిత

సౌకర్యాలెలా ఉన్నాయ్?

● శ్రీవారి భక్తులతో ముచ్చటించిన హోంమంత్రి అనిత

తిరుమల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సౌకర్యాలెలా ఉన్నాయంటూ తిరుమలలో శ్రీవారి భక్తులతో హోంమంత్రి అనిత ముచ్చటించారు. కాలినడకన శుక్రవారం తిరుమలకు చేరుకున్న ఆమె క్షేత్రసంప్రదాయాన్ని పాటిస్తూ ముందుగా వరాహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లో ప్రదక్షిణ చేశారు. ఈసందర్భంగా అక్కడున్న భక్తులను పలకరించారు. ఎక్కడి నుంచి వచ్చారు, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అంటూ కొంతసేపు వారితో మాట్లాడారు.

జగన్.. నీకు దమ్ముంటే నీ చెల్లెళ్లకు న్యాయం చేయగలవా?

తిరుపతి(నేరవిభాగం), జూలై 19: 'జగన్.. నీకు దమ్ముంటే రాష్ట్ర ప్రజలకు కాదు.. నీ చెల్లెళ్లు షర్మిల, సునీతకు న్యాయం చేయగలవా?' అని హోంమంత్రి వంగలపూడి అనిత సవాల్ విసిరారు. అంతేకానీ ప్రభుత్వంపై రోజూ బురదజల్లడం మంచిది కాదన్నారు. హోంమంత్రి కుటుంబ సమేతంగా శ్రీవారి దర్శనం నిమిత్తం శుక్రవారం తిరుపతికి విచ్చేశారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటుందని చెప్పారు. గంజాయి మత్తులో మైనర్లపై కొందరు కామాంధులు అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, అటువంటి వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఐదేళ్లలో గంజాయిని రాష్ట్ర పంటగా వైసీపీ ప్రభుత్వం పంట పండించి కోట్ల రూపాయలు దోచుకుందని విమర్శించారు. లిక్కర్‌పై దృష్టి సారించి కోట్లు దోచుకోవడం తెలిసిన జగన్‌కు, ఆయన కోటరీకి గంజాయి నిర్మూలనపై ఎందుకు దృష్టి సారించలేక పోయారని ప్రశ్నించారు. చిన్న పిల్లలు సంచుల్లో గంజాయిని తీసుకెళ్లే సంస్కృతి తీసుకొచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఐదేళ్లలో వందలాది మంది బాలికలు కనిపించకుండా పోయారని వాపోయారు. పుంగనూరులో విధ్వంసాలు సృష్టించిన చరిత్ర వైసీపీ నాయకులకే దక్కుతుందన్నారు. పల్నాడులో జరిగిన ఘటన చాలా బాధాకరమని, దీనికి ప్రభుత్వం చింతిస్తోందని చెప్పారు. ప్రస్తుతం శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. స్వార్థ రాజకీయాల కోసం వైసీపీ పాకులాడుతోందని, వారి కుయుక్తులు, ఎత్తుగడలు తమ ప్రభుత్వంలో చెల్లవన్నారు. అనంతరం అలిపిరి వద్ద పూజలు నిర్వహించాక కాలినడకన తిరుమలకు వెళ్లారు.

ఉన్మాది కోసం ముమ్మరంగా గాలింపు

● ఐదు బృందాల ఏర్పాటు

తిరుపతి(నేరవిభాగం), జూలై 19: తిరుపతి రాయల్ నగర్‌లో గురువారం వృద్ధురాలు జయలక్ష్మి గొంతు కోసి దారుణంగా హత్య చేసి పరారైన ఉన్మాది శ్రీనివాసులు కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఆమె ఇద్దరు మనవరాళ్లపైనా నిందితుడు దాడి చేసిన సంగతి తెలిసిందే. నిందితుడి ఆచూకీ కోసం వివిధ ప్రాంతాల్లోని అతడి స్నేహితుల ఫోన్ నెంబర్లు, కాల్ డేటా లాంటి వివరాలు సేకరిస్తున్నారు. అదనపు ఎస్పీ కులశేఖర్ ఆధ్వర్యంలో నగర డీఎస్పీ రవిమనోహరాచారి, క్రైం డీఎస్పీ రవికుమార్, ఎస్బీ డీఎస్పీ వెంకటాద్రి ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు, 25 మంది కానిస్టేబుళ్లు ఐదు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. నిందితుడు హైదరాబాదులో తలదాచుకున్నట్లు సెల్ టవర్ ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో పోలీసులు స్నేహితుల కదలికలపై నిఘా ఉంచారు. జయలక్ష్మి మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఉన్మాది చేతిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నియతికి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. మరో యువతి ప్రేరణకు వైద్య సేవలు అందించి డిశ్చార్జి చేసినట్లు వైద్యులు తెలిపారు.



వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా జేవీ రమణ

తిరుపతి రూరల్, జూలై 19: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా వర్సిటీ డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ డాక్టర్ జేవీ రమణను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. పశుసంవర్ధకశాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ ఈమేరకు పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఈయన ఇన్‌చార్జి వీసీగా కొనసాగుతారన్నారు. 1991లో అఖిల భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలిలో సైంటిస్ట్‌గా కెరీర్ ప్రారంభించిన రమణ.. 2001లో వెటర్నరీ వర్సిటీలో యానిమల్ న్యూట్రిషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. 2007లో ప్రొఫెసర్‌గా, 2016 నుంచి ఐదేళ్లపాటు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా పనిచేశారు. 2022 అక్టోబరు నుంచి రెండో దఫా డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్‌గా నియమితులై కొనసాగుతున్నారు. వీసీగా శనివారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

లేబర్ డీసీ బాలు నాయక్‌కు జాయింట్ కమిషనర్‌గా పదోన్నతి




తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎం.బాలు నాయక్‌కు రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ కమిషనర్‌గా పదోన్నతి కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు డిప్యూటీ కమిషనర్లకు పదోన్నతి లభించగా వారిలో బాలు నాయక్ కూడా ఉన్నారు. పదోన్నతిపై ఆయన్ను ప్రభుత్వం జాయింట్ కమిషనర్‌గా కర్నూలుకు బదిలీ చేసింది. ఈ మేరకు సంబంధిత శాఖ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.



తిరుపతి జీవితానికి పటంగట్టిన కిరణ్‌కుమారి

● విద్యాపీఠంలో ఆకట్టుకున్న చిత్రప్రదర్శన









తిరుపతి నగర జీవితానికి అద్దంపట్టే చిత్రాల ప్రదర్శన జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో రెండు రోజులపాటు సందర్శకులను ఆకట్టుకుంది. తిరుపతికి చెందిన ప్రసిద్ధ చిత్రకారిణి కిరణ్‌కుమారి గీసిన చిత్రాల ప్రదర్శనను కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌసిక్, వైస్ చాన్సలర్ కృష్ణమూర్తి శుక్రవారం ప్రారంభించగా.. శనివారం కూడా సందర్శకుల కోసం అందుబాటులో ఉంచారు. కిరణ్ కుమారి చిత్రాల్లో 90ల నాటి తిరుపతి నగరాన్ని వీక్షించవచ్చు. ఇరుకు వీధులు, మాసిన గోడలు, చిక్కుముడుల్లా స్తంభాలమీద వేలాడే తీగలు.. నగరం అంచున ఉన్న అడవి.. ఆమె కుంచె లోంచి కాన్వాసుమీదకు బదిలీ అయిన తీరు అద్భుతం. భిన్న వర్గాల మనుషుల ముఖాలు.. ఆ ముఖాల్లో ప్రతిఫలించే భావోద్వేగాలను కిరణ్‌కుమారి చిత్రాలు పటం గట్టి చూపిస్తాయి. ఆమె చిత్రాల్లో ఎక్కువగా కనిపించే వెలిసిన రంగులు, నలుపు తెలుపు.. తెలియని వేదనను వ్యక్తం చేస్తాయి. స్టిల్‌లైఫ్ చిత్రాలు ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యాపీఠంలోని చెలికాని అన్నారావు ఆడిటోరియంలో ప్రదర్శించిన కిరణ్‌కుమారి చిత్రాలను చూసిన పలువురు ఆమెను పలకరించి ప్రశంసించారు.

- తిరుపతి రూరల్

శ్రీవారిసేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి హిమా కోహ్లీ



తిరుమల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిమా కోహ్లీ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున ఆలయంలో జరిగిన అభిషేకం సేవలో ఆమె పాల్గొని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. జస్టి‌స్‌కు రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

పరిసరాల శుభ్రతకు చర్యలు

పాకాల, జూలై 19: పంచాయతీ పరిధిలో పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని పంచాయతీ కార్యదర్శి మోతీ కోరారు. శుక్రవారం పంచాయతీ పరిధిలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. మురుగు కాలువల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయించారు. చెత్తా చెదారాలు, ప్లాస్టిక్ కవర్లను మురుగు కాలువల్లో వేయరాదని కోరారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టీడీపీ నాయకుడు డేవిడ్ సురేష్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుచ్చిపై పద్మావతీ దేవి అభయం



తిరుచానూరు, జూలై 19: తిరుచానూరు పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. వేకువజామున సుప్రభాతసేవతో అర్చకులు అమ్మవారిని మేల్కొపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మూలమూర్తికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో నేత్రపర్వంగా అభిషేకం నిర్వహించారు. ఉదయం కల్యాణోత్సవం, లక్ష్మీపూజ వేడుకగా జరిగింది. మధ్యాహ్నం ఉత్సవమూర్తిని ఫ్రైడే గార్డెన్‌కు వేంచేపు చేసి తిరుమంజనం నిర్వహించారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేస్, సూపరింటెండెంట్ మధు, చంద్రశేఖర్, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో అడమార్ మఠాధిపతి



ఆలయం వద్ద శిష్యబృందంతో విశ్వప్రియతీర్థ స్వామి

తిరుచానూరు, జూలై 19: కర్ణాటక రాష్ట్రం ఉడిపిలోని అడమార్ మఠాధిపతి విశ్వప్రియ తీర్థ స్వామి శిష్యబృందంతో శుక్రవారం తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద డిప్యూటీ ఈవో గోవిందరాజన్,అర్చకులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఏవీఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన



మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భాకరాపేట, జూలై 19: చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల పంచాయతీ సచివాలయం వద్ద స్విమ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పింక్ బస్సు ద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. సలహాలు, సూచనలు అందజేశారు. 52 మంది సేవలు పొందారు. నలుగురిని స్విమ్స్‌కు రెఫర్ చేశారు. పలువురికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సోమశేఖర్ రెడ్డి, టీడీపీ నాయకులు బెల్లంకొండ మురళీ, మదనమోహన, సర్పంచ్ నాగచంగమ నాయుడు, ఆర్వీ రమణారెడ్డి పాల్గొన్నారు.

దేవరకొండ ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు

భాకరాపేట, జూలై 19: దేవరకొండ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా వేడుకలు నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం స్వామి వారికి అభిషేక అర్చనలు అనంతరం ధ్వజారోహణం, మధ్యాహ్నం కల్యాణోత్సవం, సాయంత్రం ఊంజల్ సేవ, రాత్రి గరుడ వాహన సేవ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

30న అరుణగిరిలో ఆడికృత్తిక ఉత్సవాలు

భాకరాపేట, జూలై 19: చిన్నగొట్టిగల్లు మండలం ఎగవూరు అనుములబండ (అరుణగిరి) వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త గుమ్మడి కృష్ణమూర్తి తెలిపారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కావిళ్ల చెల్లింపులు జరుగుతాయన్నారు. భక్తులందరూ మొక్కులు తీర్చుకోవాలని కోరారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

అమ్మవారి సేవలో సినీనటుడు శ్రీకాంత్



తిరుచానూరు, జూలై 19: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని సినీనటుడు శ్రీకాంత్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన ఆలయ ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. వేదపండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎన్డీఏ ప్రభుత్వంలో రాజ్యమేలుతున్న అవినీతి



- జగన్ చేసిన అప్పుల వివరాలను చంద్రబాబు బహిర్గతం చేయాలి: చింతా మోహన్

విజయవాడ(ధర్నాచౌక్), జూలై 19: ఎన్డీఏ ప్రభుత్వంలో అవినీతి రాజ్యమేలుతోందని కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీ పాలిత మహారాష్ట్రలో ఐఏఎస్ అధికారుల పోస్టింగ్‌లకు మంత్రులు రూ.5కోట్లకు బేరం పెట్టారని ఆరోపించారు. ఒక్కో ఐఏఎస్ అధికారి నుంచి రూ.5 కోట్లు వసూలు చేసి పోస్టింగ్‌లు ఇస్తున్నారన్నారు. నరేంద్రమోదీ, బీజేపీ అవినీతికి ఇది నిదర్శనమని చెప్పారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ధరలను స్థిరీకరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శించారు. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం నుంచి అధికంగా వలసలు పెరిగాయన్నారు. పోలవరం ప్రాజెక్టుపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 2019లో 2 లక్షల 65వేల కోట్ల అప్పు ఉండగా జగన్ హయాంలో రూ.14 లక్షల కోట్లకు చేరాయన్నారు. నెలకు రూ.9వేల కోట్లు వడ్డీలు కట్టాల్సి వస్తుందని చింతా మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని లక్షల కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. జగన్ చేసిన అప్పులపై వివరాలు తెలియజేయాల్సిన బాధ్యత సీఎం చంద్రబాబుపై ఉందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుంచి ఏవిధంగా కాపాడతారో చెప్పాలని డిమాండ్ చేశారు.

నానీపై చెవిరెడ్డి విమర్శలు అర్థరహితం: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పాకాల, జూలై 19: ఎమ్మెల్యే పులివర్తి నానీపై చెవిరెడ్డి చేస్తున్న అర్థరహిత, నిరాధార ఆరోపణలు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకోవాలని మండల టీడీపీ నాయకులు కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బి.నాగరాజనాయుడు, నాయకులు ఎం.వెంకటేష్‌బాబు, బొల్లినేని మహేష్ కుమార్, చంద్రశేఖర్ తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెద్దిరెడ్డితో నానీ కుటుంబ సభ్యులకు సంబంధాలు ఉన్నాయంటూ చెవిరెడ్డి చేసిన ఆరోపణలను ఖండించారు. మద్యం, ఇసుక, భూదోపిడీలకు పాల్పడేవారు మద్యంతో బలహీనవర్గాల రక్తం తాగేవారికి దుర్మార్గపు ఆలోచనలే వస్తాయన్నారు. అక్రమ వ్యాపారాలు చేసుకున్న ఘనత చెవిరెడ్డికే దక్కుతుందన్నారు. ప్రశాంతంగా వున్న చంద్రగిరిని గంజాయిగిరిగా మార్చి యువతను గంజాయికి బానిసలుగా చేసిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందన్నారు. పూలవ్యాపారి, మరో వైసీపీ నాయకుడు చంటీపై టీడీపీ నాయకులు దాడి చేశారని ఆరోపించడం తగదన్నారు. వ్యక్తిగత కారణాలతో వారిపై దాడులు జరిగాయన్నారు. దాడులను టీడీపీపైకి నెట్టడం సబబు కాదన్నారు. దొంగ ఓట్ల నమోదు వ్యవహారంపై పులివర్తి నాని ఫిర్యాదు మేరకు సిట్ దర్యాప్తు ప్రారంభమవుతుందని తానుచేసిన అక్రమాలు వెలుగు చూస్తాయని నానీపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నాని దంపతులకు సన్మానం



నాని దంపతులకు స్వాగతం పలుకుతున్న పులివర్తి వారిపల్లె గ్రామస్థులు

పాకాల, జూలై 19: ఎమ్మెల్యేగా విజయం సాధించాక మొదటిసారిగా కుటుంబసభ్యులతో కలిసి స్వగ్రామం వచ్చిన ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులకు శుక్రవారం పులివర్తివారిపల్లె గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. నాని దంపతులు గ్రామదేవత సత్యమ్మ తల్లికి, రామాలయం, వినాయకస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మిత్రులు, సన్నిహితులు, గ్రామస్థులు వారికి ఆత్మీయ సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ.. చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. స్వగ్రామం నుంచి అభివృద్ధి పనులు ప్రారంభిస్తానన్నారు.పార్టీలకతీతంగా అందరూ సహకరించాలని కోరారు. గ్రామస్థులు ఏర్పాటు చేసిన విందులో నాని కుటుంబీకులు పాల్గొన్నారు.

పాడిరైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పశుగ్రాస విత్తనాలు పంపిణీచేస్తున్న తిరుమలరెడ్డి

రామచంద్రాపురం, జూలై 19: పాడిరైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి చెప్పారు. కుప్పంబాదూరు పశువైద్యకేంద్రం వద్ద శుక్రవారం పశుగ్రాస విత్తన పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా పశువైద్యాధికారి జయకుమార్ మాట్లాడుతూ రైతుకు 20 కిలోల వంతున పశుగ్రాస విత్తనాలను అందిస్తామన్నారు. మొక్కజొన్నలు 5 కిలోలు రూ.85, జొన్నలు రూ.115 వంతున విక్రయిస్తామన్నారు. పశువైద్యాధికారి హేమకుమార్, టీడీపీ జిల్లా కార్యదర్శి హరిప్రసాద్‌నాయుడు, మహేష్‌నాయుడు, సురేంద్రనాయుడు, మధు, శేఖర్‌నాయుడు పాల్గొన్నారు.



జగనన్న కాలనీని సందర్శిస్తున్న డీఎఫ్‌వో సతీష్‌రెడ్డి

చిరుత కోసం విస్తృత నిఘా

చంద్రగిరి, జూలై 19: చిరుత పులి సంచరిస్తుందన్న సమాచార నేపథ్యంలో కొటాల సమీపంలోని జగనన్న కాలనీ వెనుక అటవీ ప్రాంతాన్ని శుక్రవారం డీఎఫ్‌వో సతీష్‌రెడ్డి సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ చిరుత కోసం ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. డ్రోన్ కెమెరా ద్వారా గాలింపు చేపట్టామన్నారు. జాడ కనిపించలేదన్నారు. ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మేకలు, గొర్రెలు, పశువుల కాపరులు అటవీ ప్రాంతంలోకి వెళ్లకూడదన్నారు. ప్రజలు ఒంటరిగా పొలాలు వద్దకు వెళ్ళకూడదని సూచించారు. అటవీశాఖ, పోలీస్ శాఖ సమన్వయంతో 24 గంటలూ పగటి, రాత్రి వేళ్ళల్లో పది మందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుందన్నారు. జాడ కనిపిస్తే సమాచారం అందించాలని కోరారు. ఎఫ్‌వో మాధవి, ఎఫ్ఎస్వో చైతన్య, డీఆర్వో వేణు, ఎఫ్‌బీవోలు అనిత, యుగంధర్, రజినీ, స్ట్రైకింగ్ ఫోర్స్ పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు హోంమంత్రి అనిత



కాలినడకన తిరుమలకు వస్తున్న అనిత

తిరుమల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. అలిపిరి నుంచి కాలినడకను ప్రారంభించిన ఆమె మధ్యాహ్నం కొండపైకి వచ్చారు. మంత్రికి స్థానిక టీడీపీ, జనసేన నాయకులు స్వాగతం పలికారు. అతిథిగృహం వద్ద టీటీడీ అధికారులు స్వాగతం పలికి బస, దర్శన ఏర్పాట్లు చేశారు. హోంమంత్రి శనివారం ఉదయం ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు.

కాలినడకమార్గంలో భద్రతను పరిశీలించా

కాలినడకమార్గంలో వచ్చే సమయంలో భక్తుల భద్రతను పరిశీలించానని హోంమంత్రి అనిత తెలిపారు. తిరుమలలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తిరుమలలో పూజాకార్యక్రమాలు, ఆధ్యాత్మిక చింతనతో ఉండాలన్నారు. రాజకీయాలు మాట్లాడకూడదన్నారు. స్వామి దయ ఎన్డీఏ కూటమిపై ఉందన్నారు. మంచి పరిపాలన చేసేందుకు స్వామి ఆశీస్సులు తమపై ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. కాలినడకమార్గంలో భద్రతను పరిశీలిస్తూనే తిరుమలకు వచ్చానన్నారు. ఒక ప్రదేశంలో కొండ వాలు కనిపించిందన్నారు. అక్కడ ఫెన్సింగ్ ఉండాల్సిన అవసరముందన్నారు. అప్పుడు క్రూరమృగాలతోపాటు బురద కూడా నడకమార్గంలోకి రాకుండా ఉంటుందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఆ పనుల కోసం చంద్రబాబు రూ.10 కోట్లు మంజూరు చేసినట్టు గుర్తుందన్నారు. గత ప్రభుత్వంలో ఆ పనులు కనిపించలేదన్నారు. పులిని కర్రతో కొట్టే సంస్కృతిని గత ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. గతంలో నడక భక్తులకు ట్యాగ్‌లు వేసేవారని, వారు సులభంగా స్వామిని దర్శించుకునే వారన్నారు. అయితే దాన్ని గత ప్రభుత్వం తొలగించిందన్నారు. దాన్ని మళ్లీ ప్రారంభించాల్సిన అవసరముందన్నారు. ఎంపీడీవో వెంకటరమణరావు అదృశ్యంపై స్పందిస్తూ ఒత్తిడి కారణంగా కనిపించకుండం లేదని చెప్పారన్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలిస్తున్నాయన్నారు. సీఎం చంద్రబాబు కూడా ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారన్నారు. ఆయనకు ఏం కాకూడదనే కోరుకుంటున్నామన్నారు. ప్రభుత్వం తరఫున అన్ని సహాయసహకారాలు అందిస్తామన్నారు.

ఎంబీయూలో విద్యార్థుల పరిచయ కార్యక్రమం



చంద్రగిరి, జూలై 19: ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో బీటెక్ అడ్మిషన్లు పొందిన విద్యార్థుల పరిచయ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈసందర్భంగా ఫ్రెష్మన్ డీన్ డాక్టర్ గిరీష్ మాట్లాడుతూ భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోడానికి అవసరమైన నైపుణ్యాలను ఎంబీయూ విద్యార్థులకు సహకరిస్తుందన్నారు. స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ బీఎం సతీష్ ఎంబీయూలోని మౌలిక సదుపాయాలను, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి బోధన పద్ధతులు, విద్యార్థుల వ్యవహార శైలి వంటి కీలక అంశాలను ప్రస్తావించారు. వైస్‌ఛాన్సలర్ నాగరాజ రామారావు మాట్లాడుతూ విద్యార్థులకు ఆకర్షణీయమైన వేతనాలతో ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని వివరించారు. కార్యక్రమంలో వివిధ డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కర్ణ జననం



హరికథ వినిపిస్తున్న భాగవతారిణి సుమతి

రామచంద్రాపురం, జూలై 19: పరమాల మహాభారత ఉత్సవాల్లో భాగంగా భాగవతారిణి సుమతి శుక్రవారం కర్ణ జననం హరికథను వినిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. సాయంత్రం ఊరేగింపు జరిగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రమేష్‌నాయుడు, సురేంద్రనాయుడు, జయరామిరెడ్డి, రోసిరెడ్డి, దుర్వాసులు పాల్గొన్నారు.



అడిగోపులకు నివాళి

తిరుపతి(కల్చరల్), జూలై 19: ప్రసిద్ధ కవి అడిగోపుల వెంకటరత్నం మృతి పట్ల సాహిత్య ప్రపంచం దిగ్భ్రాంతి ప్రకటించింది. తిరుపతి ఎన్జీవో కాలనీలోని ఆయన నివాసంలో అడిగోపుల భౌతికకాయాన్ని శుక్రవారం పలువురు సందర్శించి నివాళులు అర్పించారు. వెంకటరత్నం మృతి సాహితీ రంగానికి తీరని లోటని అన్నారు. సాహితీవేత్త భూమన్, డాక్టర్ శైలకుమార్, సాకం నాగరాజు, ఆముదాల మురళి, డాక్టర్ మౌని, వాకాప్రసాద్, ఆకుల మల్లేశ్వరరావు, తోట వెంకటేశ్వర్లు, పేరూరు బాలసుబ్రమణ్యం, మల్లారపు నాగార్జున నివాళి అర్పించినవారిలో ఉన్నారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం, తిరుపతి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం ప్రతినిధులు యువశ్రీమురళి, నెమిలేటి కిట్టన్న సంతాపం ప్రకటించారు.

కత్తెరపురుగు నష్టాల నివారణ ఇలా..



తిరుపతిరూరల్, జూలై19: వర్షాలకు మొక్కజొన్న, పశుగ్రాస పంటలకు కత్తెర పురుగు ఆశించి నష్టాన్ని చేకూర్చుతోందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం కీటక విభాగ ప్రధానశాస్త్ర డాక్టర్ కె.దేవకి పేర్కొన్నారు. రెక్క పురుగులు కోశస్థ దశ నుంచి వెలువడి మొక్కలపైనే కాకుండా కలుపు మొక్కలని కూడా ఆశిస్తున్నాయన్నారు. ఆయన సస్యరక్షణ చర్యలను సూచించారు.

- కిలో విత్తనానికి 6మి.లీ సయాంత్రనిలిప్రోల్ (19.8శాతం), థయోమిథాక్సెమ్(19.8)ని కలిపి విత్తుకోవాలి.
- పంట చుట్టూ కలుపు లేకుండా చూసుకోవాలి.
- మొలకెత్తేదశలో ఎకరాకు 4చొప్పున లింగాకర్షక బుట్టలను అమర్చుకోవడం వల్ల పురుగు ఉధృతి గమనించవచ్చు.
- లింగాకర్షక బుట్టల ఏర్పాటుతో రెక్కల పురుగులసంఖ్య తగ్గించవచ్చు.
- పంట తొలిదశలో 5శాతం వేప గింజల కషాయం లేదా వేపనూనె 5మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేస్తే గుడ్లను నిర్మూలించవచ్చు.
- పంట 30 రోజుల దశకు చేరేవరకు ఎకరాకు 10-20 పక్షి స్థావరాలు ఏర్పాటు చేయాలి.
- పశుగ్రాస పంటల్లో వీలైనంత మేర కీటక నాశినిలను వాడరాదు.
- సుడులలో ఇసుక, సున్నం 9:1 నిష్పత్తిలో లేదా మన్ను వేసుకోవడం వల్ల కత్తెరపురుగు నష్టాన్ని నివారించవచ్చు.

మిట్టపాలెం సచివాలయంలో చోరీ



అద్దాలు ధ్వంసమైన చోట వేలిముద్రలు సేకరిస్తున్న సిబ్బంది

చంద్రగిరి, జూలై 19: మిట్టపాలెం సచివాలయంలో గురువారం అర్థరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పంచాయతీ కార్యదర్శి నాగమణి ఈమేరకు ఫిర్యాదు చేశారు. దుండగులు సచివాలయ అద్దాలను ధ్వంసం చేసి, లోపకి చొరబడి రెండు ప్రింటర్లను చోరీ చేసినట్లు ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపారు. వేలిముద్రల నిపుణుల ద్వారా వివరాలు సేకరించి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపారు.

3 ఫిర్యాదులు.. 79 మందిపై కేసులు

- పుంగనూరు ఘటనలో పోలీసుల చర్యలు
- ఎంపీ మిథున్‌సహా 71 మంది వైసీపీ.. ఎనిమిది మంది టీడీపీ శ్రేణులపై కేసుల నమోదు

పుంగనూరు, జూలై 19: పుంగనూరు ఘటనలో రెండు పార్టీల పరస్పర ఫిర్యాదులతో 79 మందిపై కేసులు నమోదయ్యాయి. రెండు ఫిర్యాదులకు సంబంధించి 71 మంది వైసీపీ.. మరో ఫిర్యాదు మేరకు ఎనిమిది మంది టీడీపీవారిపై కేసులు నమోదు చేశారు. ఈ వివరాలను శుక్రవారం సీఐ జయరామయ్య వెల్లడించారు. వైసీపీకి చెందిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి గురువారం పుంగనూరు పట్టణం కొత్తఇండ్లలోని చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప ఇంటికి వచ్చారు. దీంతో నేతిగుట్లపల్లె ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని రైతులతో కలిసి టీడీపీ శ్రేణులు అక్కడికి వెళ్లారు. తోపులాట జరిగింది. వైసీపీ శ్రేణుల రాళ్లు, కర్రలు, కుర్చీలు, బాటిళ్లతో దాడులతో 12 మంది టీడీపీ శ్రేణులు, ఒక కానిస్టేబుల్ గాయపడ్డారు. దీంతో ఆగ్రహించిన టీడీపీ శ్రేణులు వాహనాలను ధ్వంసం చేశాయి. ఈ ఘటనకు సంబంధించి టీడీపీ, వైసీపీ శ్రేణులు అర్థరాత్రి పోలీసులకు ఫిర్యాదులు చేయడంతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటి వద్ద ఎంపీ మిథున్‌రెడ్డి తదితరులు టీడీపీ శ్రేణులపై రాళ్లు, కర్రల దాడితో హత్యాయత్నానికి పాల్పడినట్లు గాయపడిన పుంగనూరు టీడీపీ మైనార్టీ నేత సయ్యద్ సుహేల్‌బాషా ఫిర్యాదు ఇచ్చారు. దీనిపై ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప సహా 36 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలపై కేసు నమోదు చేశారు. అలాగే, పుంగనూరు మండలం మీర్జేపల్లెకి చెందిన గాయపడిన టీడీపీ నేత ఏఎస్ఆర్‌కే ప్రసాద్‌స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్పతో కలిసి మొత్తం 35 మందిపై కేసు నమోదైంది. ఇలా వైసీపీకి చెందిన పుంగనూరు, సదుం, పీలేరు, చిన్నగొట్టిగల్లు, కేవీపల్లె, తిరుపతి తదితర ప్రాంతాలకు చెందిన 71 మందిపై హత్యాయత్నం, తదితర కేసులు నమోదయ్యాయి. తన ఇంటిపై దాడి చేసి వాహనాలు ధ్వంసం, దహనం చేశారని మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెలుగుదేశం పార్టీకి చెందిన పోలీస్ గిరి, ఎల్.నవీన్, మరో ఆరుగురు నేతలపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

28 వరకు 144 సెక్షన్

పుంగనూరులో దాడుల నేపథ్యంలో శుక్రవారం నుంచి ఈనెల 28వ తేది వరకు 144సెక్షన్ అమలులో ఉంటుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గంలో అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ముగ్గురి కంటే ఎక్కువ జనం గుమికూడరాదని జిల్లా మేజిస్ట్రేట్ సుమిత్ కుమార్ 144 సెక్షన్ అమలులో ఉంటుందని, రాజకీయపార్టీలు, ప్రజలు సహకరించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను జిల్లా ఎస్పీ, పుంగనూరు తహసీల్దార్, పుంగనూరు సీఐలకు పంపారు.

టైలరింగ్‌లో మహిళలకు ఉచిత శిక్షణ



శిక్షణ వివరాలు తెలియజేస్తున్న నిర్వాహకులు

తిరుపతి (జీవకోన), జూలై 19: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని టీడీపీ నేత మబ్బు దేవనారాయణరెడ్డి అన్నారు. నవభారత్ సేవ సమాజ్ సంస్థ ఆధ్వర్యంలో కట్టకింద ఊరు కొత్తపల్లిలో మహిళల టైలరింగ్ శిక్షణ కోసం ఉచిత నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి రహంతుల్లా షరీఫ్ శిక్షణా సామగ్రిని మహిళలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ టైలరింగ్‌లో మూడు నెలల ఉచిత శిక్షణ పూర్తిచేసుకున్న వారికి జన్ శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో సబ్సిడీ రుణం పొందేందుకు వీలుగా సర్టిఫికెట్లు అందిస్తామనారు. కార్యక్రమంలో జన్‌శిక్షణా సంస్థాన్ శాఖ అధికారి సుధాకర్, నవభారత్ సేవా సమాజ్ సిబ్బంది సుజాత, లావణ్య, చందన, రిజ్వాన తదితరులు పాల్గొన్నారు.

న్యూరో సర్జరీ పీజీలో గోల్డ్ మెడల్



బంగారుపతకంతో పాటు పట్టా అందుకుంటున్న డాక్టర్ రవితేజ్

తిరుపతి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వాసి డాక్టర్ బత్తల రవితేజ్ చెన్నైలోని ప్రతిష్ఠాత్మక రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ నుంచీ న్యూరో సర్జరీ సూపర్ స్పెషాలిటీ మాస్టర్స్ డిగ్రీలో గోల్డ్ మెడల్ సాధించారు. చెన్నైలో శుక్రవారం జరిగిన స్నాతకోత్సవంలో చత్తీస్‌గడ్ అమిటీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ సెల్వమూర్తి నుంచి డిగ్రీతో పాటు బంగారు పతకం అందుకున్నారు. తిరుపతిలోని హోటల్ ఉదయీ ఇంటర్నేషనల్ ఎండీ బత్తల గిరినాయుడు చిన్న కుమారుడైన రవితేజ్ నెల్లూరులోని నారాయణ మెడికల్ కళాశాలలో మెడిసిన్ పూర్తి చేశారు. 2020 నుంచీ చెన్నై రామచంద్ర కళాశాలలో న్యూరో సర్జరీ విభాగానికి సంబంధించి సూపర్ స్పెషాలిటీ పీజీ కోర్సు చేశారు. ఇటీవల కోర్సు పూర్తి కాగా కళాశాల టాపర్‌గా నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. రవితేజ్ శనివారం హైదరాబాదులోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో న్యూరో సర్జన్‌గా విధుల్లో చేరనున్నారు.

ట్రాఫిక్ పోలీసులో విరిసిన మానవత్వం



పూజారికి ప్రాథమిక చికిత్స అందిస్తున్న కానిస్టేబుల్

తిరుపతి(నేరవిభాగం), జూలై 19 : ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ మానవత్వం చాటుకున్నారు. శుక్రవారం ఉదయం మంగళం రోడ్డు నుంచి దేవేంద్ర రోడ్డు వైపు వస్తున్న బీటీఆర్ కాలనికి చెందిన పూజారి నాగరాజు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. స్కూటర్ మీద నుంచి కిందకు పడ్డారు. ఎడమ కాలికి బలమైన రక్త గాయమైంది. అక్కడ డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ గమనించి వెంటనే స్పందించారు. పూజారితో నీరు తాగించారు. పక్కనే వున్న మందుల షాపు నుంచి అయింట్ మెంటు, బోరిక్ పౌడర్, డ్రస్సింగ్ క్లాత్ తీసుకొచ్చి గాయాలను శుభ్రం చేశారు. బోరిక్ పౌడర్ చల్లి కట్టుకటారు. స్థానికులు కానిస్టేబుల్‌ను ప్రశంసించారు.


కపిలేశ్వరుడికి పవిత్రసమర్పణ



తిరుపతి (కల్చరల్) జూలై 19: కపిలేశ్వరస్వామి ఆలయ పవిత్రోత్సవాలలో భాగంగా శుక్రవారం వేడుకగా గ్రంధి పవిత్ర సమర్పణ జరిగింది. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు యాగశాల పూజ, హోమం, లఘు పూర్ణాహుతి, గ్రంధి పవిత్ర సమర్పణ చేపట్టారు. సాయంత్రం 6 గంటల నుంచి 8.30 గంటల వరకు యాగశాల పూజ, హోమం, పట్టు పవిత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈవో సుబ్బరాజు, బాలకృష్ణ, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

15వ నెలా...అదెప్పుడొచ్చింది

● టోల్ గేట్ సిబ్బంది తీరుతో విస్మయం


PAPAVINASANAM TOL[L]
19-15-2024
Vehical Type: Car
Vehical Number: TR
Received Amount: 50
Sri Venkateswara National Pa[rk]

15వ నెలతో ప్రింట్ అయిన టోల్‌స్లిప్

తిరుమల, జూలై 19(ఆంధ్రజ్యోతి): 15వ నెలతో టోల్‌గేట్‌లో రసీదు ఇచ్చేసరికి వాహనదారులు విస్తుపోయారు. తిరుమలలో ఫారెస్ట్ పరిధిలోని పాపవినాశన తీర్థ ప్రాంతానికి వాహనాలు ఆకాశగంగ దాటాక టోల్‌గేట్‌లో రుసుం చెల్లించాల్సి ఉంటుంది. శుక్రవారం టోల్‌ఫీ చెల్లించాక అక్కడి సిబ్బంది ఇచ్చిన రసీదును చూసి వాహనదారులు అవాక్కయ్యారు. 19-15-2024 అని రసీదుపై ఉంది. ఫారెస్ట్ అధికారులకు నెలలు పెరిగాయా అంటూ సోషల్ మీడియాలో ఈ రసీదుపై నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. సీరియల్ నంబర్లు లేకుండా రసీదులు ఇస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని కొంతమంది విమర్శలు చేస్తే మరికొంతమంది రూ.50 టోల్ కట్టించుకోవాల్సిన సిబ్బంది రూ.40 తీసుకుని ఎలాంటి రసీదు ఇవ్వకుండా అనుమతిస్తున్నారనే ఆరోపణలు కూడా చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వ ఫారెస్ట్ అధికారులు స్పందిస్తూ నిబంధనల ప్రకారమే టోల్‌ధరలు ఉన్నాయన్నారు. రసీదులో సాంకేతిక సమస్యతో 15వ నెలగా ప్రింట్ అయ్యిందని తెలిపారు.

కావమ్మకు ఎమ్మెల్యే ఆరణి పూజలు



కావమ్మ ఆలయ పూజల్లో ఆరణి, డాక్టర్ శిరీష తదితరులు

తిరుపతి (కల్చరల్) జూలై 19: తిరుపతిలోని బెస్తవీదిలోని కావమ్మ మారయ్య ఆలయాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శుక్రవారం సందర్శించారు. ఆయనతో పాటు నగర మేయర్ డాక్టర్ శిరీష, టీడీపి నాయులు నరసింహయాదవ్, కట్టా సుధాకర యాదవ్, పూకా విజయ కుమార్, తదితరులు పాల్గొని కావమ్మకు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శాసన సభ్యులకు ఆలయ వివరాలు తెలిపారు. పూజాదికాలు నిర్వహించారు. పాత గుంట శ్రీనివాసులు తదితర ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అండర్-14 తైక్వాండోలో బాలుడి ప్రతిభ



తిరుపతి(క్రీడలు), జూలై 19: ఇటీవల సికింద్రాబాదులో పీఎం కేంద్రీయ విద్యాలయ తిరుమలగిరిలో జరిగిన బాలుర విభాగం అండర్-14 తైక్వాండో టోర్నీలో తిరుపతికి చెందిన చైతన్య ప్రతిభ కనబరిచాడు. కాంస్య పతకాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా క్రీడాకారుడు చైతన్య, శిక్షకుడు నవీన్(నవీన్‌మార్షల్ ఆర్ట్స్ శిక్షకుడు)లను పలువురు అభినందించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో రూ 1.80 లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జూలై 19: మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందిని ట్రాఫిక్ డీఎస్పీ రమణ కుమార్ శుక్రవారం పట్టుకుని నాల్గవ అదనపు జ్యుడీషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ ఎదుట హాజరు పరిచారు. న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10వేల వంతున రూ.1.80 లక్షలు జరిమానా విధించారు. అధిక మోతాదులో మద్యం తాడి ఆటో నడిపిన డ్రైవర్‌కు మూడు రోజులు జైలు శిక్ష విధించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించి వ్యాపారాలు చేస్తున్న 60 మందిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. వీరికి రూ.500 వంతున జరిమానా విధించారు.

రేపు రోల్‌బాల్ సెలక్షన్స్

తిరుపతి(క్రీడలు), జూలై 19: తిరుపతి-చిత్తూరు రోల్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రోల్‌బాల్ సెలక్షన్స్ జరుగుతాయని ఆ సంఘం జిల్లా కార్యదర్శులు ప్రేమ్‌నాథ్, కార్తీక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక శ్రీనివాస క్రీడాసముదాయంలో అండర్ 11, 14, 17, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. ఆసక్తిగల క్రీడాకారులు శనివారం సాయంత్రానికి పేర్ల నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9100709120, 998553560 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మలబార్‌లో చైన్ మేళా

తిరుపతి అర్బన్, జూలై 19: నగరంలోని మలబార్ అండ్ డైమండ్స్‌లో 'చైన్‌మేళా' కార్యక్రమం ప్రవేశపెట్టామని షోరూం ఇంచార్జ్ రిజేష్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చైన్‌మేళాలో పాల్గొన్న ఆభరణాల ప్రియులకు ప్రపంచస్థాయి షాపింగ్ అనుభూతి కల్గుతుందన్నారు. ఆకర్షణీయమైన డిజైన్లు, రోజువారి ధరించి నగలు, నల్లపూసల ఆభరణాలు ప్రదర్శిస్తామన్నారు. అన్ని ఆభరణాలపై ప్రత్యేక రాయితీ సౌకర్యం కల్పించామన్నారు.

రేపు విశ్వంలో నవోదయపై అవగాహన

తిరుపతి(విద్య),జూలై19: వరదరాజనగర్‌లోని విశ్వంస్కూల్‌లో ఆదివారం ఉదయం 10గంటలకు నవదోయ ప్రవేశపరీక్షపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు స్కూల్ చైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. సదస్సుకు 4 నుంచి 9తరగతులు చదివే విద్యార్థులు వారి తల్లిదండ్రులు హాజరైసందేహాలను నివృత్తి చేసుకోవచ్చని ఆయన తెలిపారు. వివరాల కోసం 8688888802/03, 9399976999ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.66 కోట్లు

తిరుమల, జూలై19 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.66 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. 24,549 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

ఒకే నంబరు కార్లపై పోలీసుల సైలెంట్ !

తిరుపతి(కలెక్టరేట్), జూలై 19: కలెక్టరేట్‌లోని ఓ ఉద్యోగి ఒకే నెంబరు (ఏపీ 21 ఏజీ0099)తో రెండు కార్లు వినియోగిస్తున్న వైనంపై పోలీసులు దృష్టి సారించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి ఈ విషయం వెలుగులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఒ సమాచారశాఖ ఉద్యోగి రెండు షిఫ్ట్‌కార్లకు ఒకే నెంబరు వేసుకుని వినియోగిస్తున్నారు. శుక్రవారం కలెక్టరేట్‌కు చేరుకున్న పోలీసులు వైట్ షిఫ్ట్‌కారు ఒరిజనల్‌గా, గ్రే కలర్ కారు మరో రాష్ట్రం రిజిస్ట్రేషన్‌కు చెందినట్లు పోలీసులు గుర్తించారు. కర్ణాటక నుంచి తీసుకవచ్చిన షిఫ్ట్‌కారుకు మరొక కారు నెంబరు ప్లేట్ తగిలించుకుని ఎందుకు తిరుగుతున్నారనే విషయంపై ఆరా తీశారు. చివరికి కలెక్టరేట్‌లోని ఓ అధికారి ఒత్తిడితో మిన్నకుండిపోయినట్లు తెలిసింది. సదరు ఉద్యోగి రాత్రికి రాత్రే కలెక్టరేట్ నుంచి రెండు కార్లను తీసుకుపోయారు. అధికారి ఒత్తిళ్లతో పోలీసులు కారు అంశాన్ని వదిలేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

పేద విద్యార్థులకు సాయం అభినందనీయం



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

బంగారుపాళ్యం, జూలై 19: పేద విద్యార్థులకు దాతల సాయం శ్లాఘనీయమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. శుక్రవారం బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జీఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత ఈశ్వర్ నాయుడు, ఎన్ఆర్ఐ కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో అభయం ట్రస్టు ద్వారా విద్యా సామగ్రిని ఎమ్మెల్యే మురళీమోహన్ చేతుల మీదుగా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈశ్వర్‌నాయుడు మాట్లాడుతూ ఏడేళ్లుగా ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు సాయం అందిస్తున్నామన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి ధరణి, జనార్ధన్ గౌడ్, మోహన్ నాయుడు, ఎంఈవోలు నాగేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ, మాజీ ఎంపీ, టీటీడీ మాజీ చైర్మన్ టి.సుబ్బిరామిరెడ్డి, సినీహీరో చిరంజీవి అల్లుడు విష్ణుప్రసాద్, వైసీపీ ఎమ్మెల్సీ కల్యాణి, తెలంగాణ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఇండియా ఫిట్నెస్ ఎక్స్‌పర్ట్ దినాజ్ వేర్వత్వాల ఉన్నారు. దర్శనానంతరం మహేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండాలని ప్రార్థించానన్నారు.

ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ ఏర్పాటుకు కృషి

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ నమూనా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ వీక్షిస్తున్న ఎమ్మెల్యే

తిరుపతి(ఆర్టీసీ), జూలై 19: వరల్డ్ క్లాస్ ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పనుల ప్రారంభానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక ప్రజా రవాణాధికారి కార్యాలయాన్ని సందర్శించారు. డీపీటీవో చెంగల్‌రెడ్డి అధునాతన హంగులతో బస్సు సముదాయ నిర్మాణానికి సంబంధించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రూ.485కోట్లు నిర్మాణ వ్యయమతుందన్నారు. టెండర్లకు వెళ్లాల్సి ఉందన్నారు. ఈ అంశాలను ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కార్యరూపం దాల్చేందుకు కృషి చేస్తానని ఆరణి హామీ ఇచ్చారు. అంతకుముందు ఎమ్మెల్యే బస్టాండులో కలియ తిరిగారు. పారిశుధ్యంపై అసంతృప్తి చెందారు. టాయిలెట్ల నిర్వహణ సరిగాలేదన్నారు. టాయిలెట్లకు అధిక రుసుం వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఫిర్యాదు చేశారు. నిర్వహణదారులపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. అనంతరం ఎలక్ట్రిక్ బస్సులో ప్రయాణించి సంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి నేతలు నరసింహయాదవ్, మబ్బు దేవనారాయణరెడ్డి, పి.హరిప్రసాద్, రాజారెడ్డి, మహేష్‌యాదవ్, హేమంత్‌యాదవ్, ఆర్టీసీ అధికారులు భాస్కర్‌రెడ్డి, చెన్నకేశవ, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

తిరుపతి(ఆటోనగర్), జూలై19: నగరంలో గంజాయి విక్రయాలను ఉక్కుపాదంతో అణచివేసి మహిళలకు భద్రత కల్పించాలని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కోరారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే, ఆయన కుమారుడు కలసి గంజాయి విచ్చలవిడి విక్రయాలకు సహకరించారన్నారు. ఫలితంగా యువత హద్దు మీరి హత్యలు,దాడులు,మానభంగాలకు పాల్పడుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. రాయల్ నగర్‌లో వృద్ధురాలి హత్య ఘటన దుర్మార్గమన్నారు. గంజాయి మత్తులో చిన్నపిల్లలు మొదలు 60 ఏళ్ల వృద్ధులపై కూడా లైంగికదాడులకు తెగబడుతున్నారన్నారు. హత్యలకూ వెనకాడటం లేదన్నారు. గత ప్రభుత్వ ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి గంజాయి కట్టడిని కృషి చేస్తామన్నారు. గంజాయి మత్తువల్ల జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. మహిళా నాయకులు బ్యాంక్ శాంతమ్మ, కుమారమ్మ, తరుణి, జాహ్నవి పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం : ముగ్గురి అరెస్టు

మంగళం, జూలై19: ప్రకాశం జిల్లా కొమరోలు మండలంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి 28 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కడప సబ్ కంట్రోల్ ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ నరేష్ టీం, అటవీ సిబ్బంది గురువారం అర్ధరాత్రి ప్రకాశం ఫారెస్టు డివిజన్ బెస్తవారిపేట రేంజీ తాటిచెర్ల సెక్షన్, నల్లకుంట అటవీ బీటులోని అక్కాపల్లి చెరువు దగ్గర తనిఖీ చేస్తుండగా కొందరు ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తూ కనిపించారు. వారిని టాస్క్‌ఫోర్సు సిబ్బంది చుట్టుముట్టారు. నిందితులు పారిపోవడానికి ప్రయత్నించారు. వెంబడించి ముగ్గురిని పట్టుకున్నారు. కారులో లోడ్ చేసిన 17 ఎర్రచందనం దుంగలను, వారు పడవేసి వెళ్లిన 11 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారిని ఒంగోలు టౌన్‌కు చెందిన పేరం రామరాజు(44), సంచర్ల పంచాయతీ రామేశ్వరానికి చెందిన రాచకొండ రామయ్య(25), క్రిష్ణంశెట్టిపల్లి మండలం షేక్ ఖాసీం(43)గా గుర్తించారు. పేరం రామరాజుకు తమిళనాడు స్మగ్లర్లతో సంబంధాలు ఉన్నట్లు టాస్క్‌ఫోర్సు పోలీసులు తెలిపారు. స్మగ్లర్లను వాహనంతో సహా ఎర్రచందన్ని తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయానికి తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌చార్జి వీసీల బాధ్యతల స్వీకరణ



అప్పారావుకు అభినందిస్తున్న ఉద్యోగులు



బాధ్యతలు స్వీకరించిన ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 19: ఎస్వీయూ, పద్మావతి యూనివర్సిటీల ఇన్‌చార్జి వీసీలుగా అప్పారావు, ఉమ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి వీసీలుగా గురువారం వీరిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమకు అప్పగించిన బాధ్యతను దీక్షతో నిర్వహిస్తామన్నారు. యూనివర్సిటీల్లో తమ గతానుభవంతో విద్యార్థులు, ఉద్యోగుల కోసం పని చేస్తామన్నారు. పలువురు విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులు వారిని అభినందించారు.

సంస్కృతవర్సిటీలో ముగిసిన సదస్సు



మాట్లాడుతున్న వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి

తిరుపతిరూరల్,జూలై19: జాతీయ సంస్కృత వర్సిటీలో సాహిత్య అకాడమీ(నూఢిల్లీ), వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో రెండ్రోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సాహిత్య శాస్త్ర గ్రంథాల్లో వైజ్ఞానిక అంశాలను వెలికితీసి భావితరానికి అందించేందుకు ఇటువంటి సదస్సులు దోహదం చేస్తాయన్నారు. సాహిత్యశాస్త్రంలో వైజ్ఞానికత, కావ్యసౌందర్యం వంటి ఎన్నో అంశాలు నిక్షిప్తమై ఉన్నాయన్నారు. వీటిపై విద్యార్థులు శ్రద్ధగా అధ్యయనం చేయాలని సూచించారు. మాజీ వీసీ హరేకృష్ణ శతపథి, సోమనాథ్ సంస్కృత వర్సిటీ మాజీ వీసీ గోపబంధు మిశ్ర, సాహిత్య అకాడమీ సెక్రటరీ కె.శ్రీనివాసరావు, అద్వైత వేదాంత విభాగ హెడ్ ప్రొఫెసర్ గణపతి భట్, ఎన్.సురేష్, రాజగోపాల్, భరత్ భూషణ్‌రథ్, సి.రంగనాథన్, జేటీ చక్రవర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్వీయూ రిజిస్ట్రార్‌గా భూపతి నాయుడు బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 19: ఎస్వీ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు నియమితులయ్యారు. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దూరవిద్యా విభాగంలో స్టాటిస్టిక్స్ ప్రొఫెసర్‌గా భూపతి నాయుడుకు యూనివర్సిటీతో సుదీర్ఘ అనుబంధం ఉంది. గుడిపాల మండలం చెరుకూరి కండ్రిగకు చెందిన ఈయన 1997లో దూరవిద్యా విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. 2006లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2012లో ప్రొఫెసర్‌గా అప్‌గ్రేడ్ అయ్యారు. 12పీహెచ్‌డీలు, ఏడు ఎంఫిల్‌లకు పర్యవేక్షకుడిగా వ్యవహరించారు. ఏడు పుస్తకాలు రాశారు. 30 ఏళ్ల పరిశోధన అనుభవాన్ని గడిచిన ఈయన దూరవిద్యా పరీక్షల కో-ఆర్డినేటర్‌గా సేవలందించారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ జాతీయ కౌన్సిల్ కార్యవర్గ సభ్యుడిగా వ్యవహరించారు. వివిధ హోదాల్లో పని చేశారు.

రేపు తిరుమలలో చాతుర్మాస దీక్ష

తిరుమల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల పెద్దజీయర్ స్వామి ఆధ్వర్యంలో ఆదివారం చాతుర్మాస దీక్ష సంకల్పం జరగనుంది. హైందవ శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజ, కార్తిక మాసాల్లో ఆచార్య పురుషులు లోకకల్యాణార్థం స్నాన, జప, హోమ, వ్రత దానాదులను నిర్వహించడం ఆనవాయితీ. రామానుజాచార్యుల వంశపారంపర్య ఆచారంలో భాగంగా వ్యాస పౌర్ణమి మరునాడు నుంచి ఈ చాతుర్మాస దీక్ష సంకల్పాన్ని చేపట్టడం విశేషమైనదిగా భావిస్తారు. తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ ముందుగా పెద్దజీయర్‌స్వామి తిరుమల బేడి ఆంజనేయస్వామి ఆలయం పక్కనే ఉన్న జీయంగారి మఠం నుంచి చిన్నజీయంగారు శిష్యబృందంతో కలిసి వరాహస్వామి ఆలయాన్ని, తర్వాత స్వామి పుష్కరిణిని సందర్శిస్తారు. అనంతరం శ్రీవారి ఆలయానికి వస్తారు. ఆలయ మహద్వారం వద్ద టీటీడీ ఈవో, ఆలయ అధికారులు ఈ బృందాన్ని ఆహ్వానిస్తారు. జీయంగార్లు శ్రీవారిని దర్శించుకున్నాక రంగనాయక మండపంలో పెద్దజీయర్‌స్వామికి మేల్‌చాట్ వస్త్రాన్ని, చిన్నజీయర్‌స్వామికి నూలుచాట్ వస్త్రాన్ని బహూకరిస్తారు.

రేపు పౌర్ణమి గరుడసేవ

తిరుమలలో ఆదివారం పౌర్ణమి గరుడసేవ జరగనుంది. ఆదివారం రాత్రి ఏడు నుంచి తొమ్మిది గంటల మధ్య సర్వాలంకార భూషితులైన మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడుడిపై కొలువుదీరి తిరుమాడవీధుల్లో విహరిస్తూ దర్శనమివ్వనున్నారు.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం

సీఐడీ డీఎస్పీ పద్మలత



చట్టాల గురించి వివరిస్తున్న సీఐడీ డీఎస్పీ పద్మలత

తిరుపతి(విద్య), జూలై 19: కేంద్రం తాజాగా ప్రవేశపెట్టిన చట్టాలపై అవగాహన అవసరమని సీఐడీ డీఎస్పీ పద్మలత అన్నారు. ఆగస్టు 1 నుంచి కొత్త క్రిమినల్ చట్టాలు అమలులోకి వస్తున్న నేపథ్యంలో సీఐడీ ఆధ్వర్యంలో పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో శుక్రవారం అవగాహనా కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరిదేవితో డీఎస్పీ పాల్గొన్నారు. పద్మలత మాట్లాడుతూ బ్రిటిష్ కాలంనాటి క్రిమినల్ చట్టాల్లో కేంద్ర ప్రభుత్వం కొన్ని మార్పులు తీసుకువచ్చిందన్నారు. భారతీయ న్యాయ సంహిత, నాగరిక్ సురక్ష సంహిత, సాక్ష్య అధినియం చట్టాలను తీసుకు వచ్చిందన్నారు. మహిళలు, పిల్లలపై జరిగే నేరాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించి న్యాయ సంహిత చట్టంలో మార్పులు చేసిందన్నారు. శిక్షలను కఠినతరం చేసిందన్నారు. కార్యక్రమంలో పద్మావతి జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థినులతోపాటు అధ్యాపక సిబ్బంది, సీఐడీ అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



నాయుడుపేట టౌన్, జూలై 19: నాయుడుపేట జూనియర్ సివిల్ కోర్టు వద్ద న్యాయవాదులు నిరసన తెలియజేశారు. విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యులపై జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం కోర్టు వద్ద ప్లకార్డులతో నినాదాలు చేస్తూ నిరసన తెలియజేశారు. నాయుడుపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్, న్యాయవాదులు పార్థసారధిరెడ్డి, కిరణ్, రమణయ్య, రఫీ, సుమన్ తదితరులు ఉన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్ట్

గూడూరు, జూలై 19: స్థానిక రెండో పట్టణ పరిధిలో ఓ యువతిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ... స్థానిక అశోక్‌నగర్‌కు చెందిన వినయ్‌కుమార్ ఓ ప్రైవేటు జూనియర్ కళాశాల విద్యార్థిని కళాశాల నుంచి వస్తుండగా అడ్డగించి, బెదిరించి బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని ఓ ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన విషయం విదితమేనన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశాన్నారు. శుక్రవారం తాళమ్మగుడి సమీపంలో నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు. వినయ్‌కుమార్‌పై 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉందన్నారు. సీఐ పాపారావు, రెండో పట్టణ ఎస్ఐ సుబ్రమణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

లైంగిక దాడులకు పాల్పడే వారిని శిక్షించండి

గూడూరు, జూలై 19: మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శశికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం టవర్‌క్లాక్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు. ఈ సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. యశ్వంత్, ప్రణయ్, విక్రమ్, సందీప్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి వీసీల బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 19: ఎస్వీయూ, పద్మావతి యూనివర్సిటీల ఇన్‌చార్జి వీసీలుగా అప్పారావు, ఉమ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి వీసీలుగా గురువారం వీరిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇన్‌చార్జి వీసీలుగా వారు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమకు అప్పగించిన బాధ్యతను దీక్షతో నిర్వహిస్తామన్నారు. యూనివర్సిటీల్లో గత అనుభవంతో విద్యార్థులు, ఉద్యోగుల కోసం పని చేస్తామన్నారు. పలువురు విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులు వారిని అభినందించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఉమ

పుత్తూరు వార్తలు

టీడీపీ కార్యకర్తకు పరామర్శ



టీడీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న విజయబాబు

పుత్తూరు అర్బన్, జూలై 19: మండల పరిధిలోని గొల్లపల్లె గ్రామానికి చెందిన పాల నాగభూషణంను శుక్రవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ నాగభూషణం ఆస్పత్రి లో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటు న్నారు. ఆయనను పరామర్శించిన విజయబాబు ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుని త్వరగా కోలుకో వాలని ఆకాంక్షించారు. అనంతరం ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట టీడీపీ నేతలు బాబూ రాయల్, పరంధామ, కుమార్‌రెడ్డి, సారధి ఉన్నారు.

పర్యావరణంపై అవగాహన అవసరం

పుత్తూరు అర్బన్, జూలై 19: విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని నారాయణ విద్యాసంస్థల ఏజీఎం కిషోర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని నారాయణ స్కూల్‌లో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్ర మంలో ఆర్ఐ కిరణ్ ప్రిన్సిపల్ తిరువనావక్కరసు, కోఆర్డినేటర్ ద్రాక్షాయణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

పుత్తూరు, జూలై 19: ప్రభుత్వం సరఫరా చేసిన నాణ్యమైన బియ్యం, కంది పప్పు పంపిణీని తహసీల్దారు శ్రీనివాసగౌడ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారం బియ్యం, కంది పప్పు విక్రయించాలని దుకాణదారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ డీటీ విష్ణు, గురుస్వామి, ఆశ, యశోద, టీడీపీ పట్టణాధ్యక్షుడు జీవరత్నం నాయుడు, కార్యదర్శి ధనపాల్, మాజీ మున్సిపల్ చైర్మన్ యుగంధర్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న కార్యదర్శి శ్రీలేఖ

వడమాలపేట, జూలై 19: వాతావరణ మార్పుల దృష్ట్యా పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలని పంచాయతీ కార్యదర్శి శ్రీలేఖ అన్నారు. శుక్రవారం డ్రై డే సంద ర్భంగా వడమాలపేటలో కాలువలను శుభ్రం చేయించారు. దాసరివీధిలో పలు చోట్ల కాలువల్లో పూడిక తీయించారు. చెత్తకుండీలు ఏర్పాటు చేశారు. కార్య క్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ఐదేళ్లలో రాష్ట్రం అగ్రస్థానం

- సీఎం చంద్రబాబు అనుభవంతో పాలన సాగిస్తున్నారు
- డక్కిలి మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కురుగొండ్ల

డక్కిలి, జూలై 19: జగన్ రెడ్డి గడిచిన ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసేశారని, ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో పరిపాలిస్తున్నారని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం డక్కిలి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... టీడీపీ అధికారం చేపట్టే నాటికి రాష్ట్ర ఖజానాలో చిల్లిగవ్వ లేదన్నారు. అయితే సీఎం చంద్రబాబు అనుభవంతో వనరులను సమకూర్చుకుని చెప్పినవన్నీ ఒక్కొక్కటిగా చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగులకు, పింఛనుదారులకు టంచనుగా జీతాలు అందించడం ఇందుకు నిదర్శనమన్నారు. అనంతరం శాఖల వారీగా అధికారులతో సమీక్షించారు. తాగునీటి అవసరాల కోసం సుమారు రూ.5 కోట్లకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని ప్రభుత్వం నుంచి విధివిధానాలు వచ్చాక పనులు ప్రారంభిస్తామన్నారు. గృహ లబ్ధిదారులకు గతంలో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇచ్చేవారని ప్రస్తుతం ధరల మేరకు రూ.3.50 లక్షల వరకు పెంచే అవకాశం ఉందన్నారు. ఉపాధి పథకాన్ని పారదర్శకంగా నిర్వహించాలని ఏపీవో లక్ష్మీనారాయణకు సూచించారు. మండలంలోని చెరువుల స్థితిగతులు గురించి ఇరిగేషన్ శాఖ అధికారులను అడిగి తెలుసుకొన్నారు. అలపరేరు డ్యాం మరమ్మతులకు రూ.30 లక్షలతో ప్రతిపాదనలు పంపామని అధికాలు చెప్పారు. డక్కిలి మండలంలో సుమారు 20 వేల ఎకరాలకు పైగా మేత పోరం బోకు భూముల్లో రైతులు సాగు చేసుకుంటున్నారని వాటికి పట్టాలు అందేలా చూస్తామన్నారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పేదలకు సెంటు భూమికి పట్టాలు ఇవ్వలేదన్నారు. అనంతరం ఆయన దేవునివెల్లంపల్లి సెంటరులో ఏర్పాటుచేసిన నిత్యావసర సరుకుల పంపిణీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు జి.చంద్రశేఖరరెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏ.రామచంద్రయ్యనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పి.కోటేశ్వరరెడ్డి, నాయకులు కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ, పులి జనార్దనరెడ్డి, రంగినేని రాజా, ఎం. శివకుమార్‌రెడ్డి, చైతన్య రెడ్డి, డి.పెంచలరెడ్డి, డి.చంద్రారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో లీలా మాధురి, ఎస్ఐ చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.



పేదలకు నాణ్యమైన సరుకులు అందచేస్తున్న కురుగొండ్ల

రైతులకు న్యాయం జరిగేలా చర్యలు: కలెక్టర్

చిల్లకూరు/ కోట, జూలై 19: చిల్లకూరు మండలంలోని తమ్మినపట్నం, కోట మండలంలోని కొత్తపట్నంలో రైతులు సాగు చేసుకునే భూములకు పరిహార విషయమై న్యాయం చేస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శుక్రవారం చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (సీబీఐసీ) సంబంధించి భూసేకరణ విషయమై ప్రభుత్వ భూమి, డీకేటీ పట్టాలు, ఏలాంటి రికార్డులు లేకుండా ప్రభుత్వ భూమి అనుభవంలో ఉన్న రైతులతో ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినపట్నంలో జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామంలో గతంలో ఏపీఐఐసీకి భూములు కేటాయించారన్నారు. అయితే ఆ భూముల్లో నిర్మాణాలు చేపట్టకపోవడంతో రైతులు సాగు చేసుకుంటున్నారన్నారు. పట్టా భూమి, డీకేటీ పట్టా భూములకు సంబంధించి వెబ్‌ల్యాండ్‌లో ఏపీఐఐసీ అని నమోదైన వాటికి రైతుల వద్ద ఉన్న ఆధారాల రికార్డుల మేరకు అర్హత ఉన్న వారికి పరిహారానికి సిఫార్సు చేస్తామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ భూమిలో రైతులు అనుభవం ఉన్న వారు ఎన్ని సంవత్సరాలుగా ఎంత విస్తీర్ణంలో ఎంత పెట్టుబడి పెట్టి సాగు చేస్తున్నారో పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సర్వే నిర్వహించాలని ఆర్డీవో కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. అనంతరం సాగులో ఉన్న వేరశనగ పంటను పరిశీలించారు. ఇక కొత్తపట్నం పంచాయతీలో 900 ఎకరాల ప్రభుత్వ పట్టా భూములను తీసుకోవాల్సి ఉందని కలెక్టర్ అన్నారు. అందులో మొదటి విడతగా గతంలో 425 ఎకరాలను తీసుకున్నారన్నారు. అయితే ఆ భూములను ఏపీఐఐసీ అప్పగించే సమయంలో ఆ భూములపై సాగుదారులు లేరన్నారు. ప్రస్తుతం కారిడార్‌కు వెళ్లిన భూముల్లో జీడీమామిడి, వేరుశెనగ పంటలు వేసుకొని 150 మంది రైతులు ఉన్నట్లు తెలిసిందన్నారు. ఆ రైతులకు కూడా గ్రామసభల ద్వారా గుర్తించి నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, తహసీల్దార్లు శ్రీనివాసులు, నాగరాజారావు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తమ్మినపట్నం గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

సాంకేతికత ఆకలింపుతోనే మహిళా సాధికారత

- భారత్ బయోటెక్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుచిత్ర ఎల్లా



జ్యోతి వెలిగిస్తున్న గల్లా జయదేవ్

రేణిగుంట, జూలై 19: ఆధునిక పోటీ ప్రపంచంలో నేటి మహిళలు సాంకేతికతను అందిపుచ్చుకుని ఆకలింపు చేసుకుంటే మహిళా సాధికారత సాధ్యపడుతుందని భారత్ బయోటెక్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుచిత్ర ఎల్లా అభిప్రాయపడ్డారు. శుక్రవారం రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ పరిధిలో ఉన్న అమరరాజ ప్రాంగణంలో సీఐఐ ఆధ్వర్యంలో మహిళా సాధికారత లీడర్‌షిప్ ప్లాన్ క్లాన్‌కేవ్ ఆన్ పయనీరింగ్ ప్రోగ్రెస్ అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. అమరరాజా సంస్థల ఎండీ గల్లా జయదేవ్, మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి, సీఐఐ చైర్మన్ మహాత్మాగాంధీ, క్యాన్సర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ మురళి, సీఐఐ సదరన్ రీజియన్ చైర్మన్ షిరిన్ సాలిస్, అరవింద ఐ ఆస్పత్రి ఫౌండింగ్ మెంబర్ నటచైర్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్ పాల్గొన్నారు.

చెలరేగిన దోపిడీ దొంగలు

- భక్తుడి సెల్‌ఫోన్, నగదు అపహరణ

శ్రీకాళహస్తి, జూలై 19: శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలో ఇద్దరు దోపిడీ దొంగలు చెలరేగిపోయారు. రోడ్డులో నడిచి వెళ్తున్న భక్తుడిని అర్ధరాత్రి అడ్డగించి రూ.5వేలు నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కుని పరారయ్యారు. మదనపల్లెకు చెందిన ధనుష్ రేణిగుంటలోని ఓ ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తుంటాడు. గురువారం ముక్కంటీశుడిని దర్శించుకున్నాడు. అర్ధరాత్రి ఆలయ సమీపంలోని సన్నిధివీధిలో ధనుష్ నడచివెళుతుండగా ఆటోలో వచ్చిన ఇద్దరు యువకులు అడ్డగించారు. ధనుష్‌పై దాడి చేసి రూ.5వేల నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కుని పరారయ్యారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ధనుష్ శ్రీకాళహస్తి పట్టణమంతా దోపిడీ దొంగల కోసం గాలించాడు. సన్నిధివీధిలో ఈ తరహా నేరాలకు పాల్పడే వారి గురించి ఆరా తీశాడు. ఈ క్రమంలో అగ్నిమాపక కేంద్రం సమీపంలో ఒక దొంగను గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించగా ఎస్‌డీకే నగర్‌కు చెందిన హుస్సేన్‌గా తెలిసింది. ఇతడితో పాటు పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ ప్రేమ్‌తో కలిసి దాడి దోపిడీకి పాల్పడినట్లు అంగీకరించాడు. ప్రేమ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ధనుష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

డీలర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

సత్యవేడు, జూలై 19: బియ్యం పంపిణీలో రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ రామాంజనేయులు హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు బియ్యాన్ని పంపిణీ చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఉదయం 8 గంటలకు ముందే షాపులు తెరిచి ఎండీయూలకు బియ్యం సరఫరా చేయాలని సూచించారు. ప్రతినెలా 1వ తేదీ నుంచి 17వ తేదీ వరకు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాలన్నారు. 18వ తేదీ సాయంత్రాని కల్లా మిగిలిన బియ్యం స్టాక్ నివేదికను కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. సరిహద్దు గ్రామాల్లో బియ్యం పంపిణీ తక్కువ శాతం నమోదు అవుతుండడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చూశారు. తక్కువ శాతం బియ్యం పంపిణీ అవుతున్న గ్రామాల్లో వాస్తవ పరిస్థితులపై నివేదిక ఇవ్వాలని డీలర్లను కోరారు. శాశ్వతంగా గ్రామాలను వదిలివెళ్లిన, మృతి చెందిన వారి రేషన్ కార్డులను తొలగించాలని సూచించారు. సమావేశంలో డీటీ రవిచంద్రబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఘనంగా రొట్టెల పండుగ



రొట్టెలు మార్చుకుంటున్న భక్తులు

చిల్లకూరు, జూలై 19: స్థానిక దో షహీద్ దర్గాలో శుక్రవారం రొట్టెల పండుగ ఘనంగా నిర్వహించారు. నెల్లూరులోని బారా షహీద్ దర్గాలో రొట్టెల పండుగ ప్రారంభమైన మూడో రోజు చిల్లకూరులో రొట్టెల పండుగ నిర్వహించడం అనవాయితీగా వస్తుందని ముజావర్ జుబేర్‌బాసా తెలిపారు. దర్గాలోని సయ్యద్ మహ్మద్‌సా, సయ్యద్ అహ్మద్‌సా సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెంచలకోన ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తానంకి నానాజీ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యేకు వినతి

కోట/ గూడూరు, జూలై 19: కోట మండల పరిధిలోని గూడలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని ఆర్అండ్‌బీ రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు వేయాలంటూ శుక్రవారం హెచ్ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో సుమారు 300 మంది విద్యార్థులు రోడ్డును దాటుతుంటారన్నారు. గూడూరు పట్టణంలోని అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే నివాసం వద్ద శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని పలువురు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను కలిసి పలు సమస్యలను పరిష్కరించాలని అర్జీలను అందజేశారు.

ఫిష్ పాండ్‌లతో ఆర్థిక వనరుల పెంపు



పనులను పర్యవేక్షిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్

ఏర్పేడు, జూలై 19: ఫిష్ పాండ్‌ల తవ్వకం వల్ల పంచాయతీలకు ఆర్థిక వనరులు పెరుగుతాయని డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్ అన్నారు. ఏర్పేడు మండలం మాధవమాల పంచాయతీలో ఉపాధి హామీ పథకం కింద ఫిష్ పాండ్ తవ్వకం పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా చెరువుల్లో తవ్విన ఫిష్‌పాండ్‌లను వేలం ద్వారా చేపల పెంపకానికి లీజుకు ఇవ్వవచ్చన్నారు.

వైభవంగా పుట్టాలమ్మ తిరునాళ్లు

నారాయణవనం, జూలై 19: మండల పరిధిలోని పాలమంగళం ఉత్తరం గ్రామంలో గ్రామదేవత కన్ని పుట్టాలమ్మ ఆడిమాస తిరునాళ్ల శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేపాకు తోరణాలు, మాలదారణతో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి భక్తులు అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 4 గంటలకు మహిళలు పొంగళ్లు పెట్టారు. రాత్రి బాణసంచా పేలుళు, కోలాటాలు, మంగళ వాయిద్యాలు నడుమ అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

తుడా పార్కు పరిశీలన

రేణిగుంట, జూలై 19: రేణిగుంట పట్టణం బిస్మిల్లా నగర్‌లోని తుడా పార్కును టీడీపీ నాయకులతో కలిసి అధికారులు శుక్రవారం పరిశీలించారు. స్థానిక మహిళలు మాట్లాడుతూ వైసీపీ పాలనలో తుడా పార్కు నిర్వహణ పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి పోయాయని, వర్షపునీరు నిలిచి వాకింగ్‌కు, పిల్లలు ఆడుకునేందుకు ఇబ్బందిగా ఉందన్నారు. ఎంపీడీవో విష్ణు చిరంజీవి, ఈవోపీఆర్డీ వెంకటరత్నమ్మ, పంచాయతీ కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, టీడీపీ పట్టణాధ్యక్షుడు మహబూబ్‌బాషా, నాయకులు కన్నన్‌రెడ్డి, రవి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ ప్రభుత్వంలో రాజ్యమేలుతున్న అవినీతి

- జగన్ చేసిన అప్పుల వివరాలను చంద్రబాబు బహిర్గతం చేయాలి
- చింతా మోహన్

విజయవాడ(ధర్నాచౌక్), జూలై 19: ఎన్డీఏ ప్రభుత్వంలో అవినీతి రాజ్యమేలుతోందని కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత మహారాష్ట్రలో ఐఏఎస్ అధికారుల పోస్టింగ్‌లకు మంత్రులు రూ.5కోట్లకు బేరం పెట్టారని ఆరోపించారు. ఒక్కో ఐఏఎస్ అధికారి నుంచి రూ.5 కోట్లు వసూలు చేసి పోస్టింగ్‌లు ఇస్తున్నారన్నారు. నరేంద్రమోదీ, బీజేపీ అవినీతికి ఇది నిదర్శనమని చెప్పారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ధరలను స్థిరీకరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శించారు. సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం నుంచి అధికంగా వలసలు పెరిగాయన్నారు. పోలవరం ప్రాజెక్టుపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 2019లో 2 లక్షల 65వేల కోట్ల అప్పు ఉండగా జగన్ హయాంలో రూ.14 లక్షల కోట్లకు చేరాయన్నారు. నెలకు రూ.9వేల కోట్లు వడ్డీలు కట్టాల్సి వస్తుందని చింతా మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని లక్షల కోట్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. జగన్ చేసిన అప్పులపై వివరాలు తెలియజేయాల్సిన బాధ్యత సీఎం చంద్రబాబుపై ఉందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుంచి ఏవిధంగా కాపాడతారో చెప్పాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న చింతా మోహన్

రాష్ట్ర సంపదను కొల్లగొట్టారు: ఎమ్మెల్యే సునీల్

చిట్టమూరు, జూలై 19: గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర సంపదను కొల్లగొట్టారని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ధ్వజమెత్తారు. శుక్రవారం ఈశ్వరవాక, అరవపాళెంలలో సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, ప్రజా ఆరోగ్య ఉప కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన ఈశ్వరవాకలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గనులు, సిలికా, ఇసుక, గ్రావెల్, వైట్ క్వార్ట్జ్ వంటి విలువైన ఖనిజ సంపదను అడ్డంగా దోచుకున్నారన్నారు. జగన్ అలీబాబా అయితే... పెద్దిరెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల, వై.వీ సుబ్బారెడ్డి, కొంత మంది ఐఏఎస్‌లు నలభై దొంగల్లా అవతారమెత్తారని ఆరోపించారు. అప్పు ఎక్కడ నుంచి తెచ్చారో కూడా అర్థం కాని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. కొందరు సచివాలయం సిబ్బంది ఇంకా వైసీపీ మాయలో ఉన్నారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జి.కిషోర్‌నాయుడు, గోపాల్‌రెడ్డి, జి.కస్తూరయ్య, ఎం. జనార్దన రెడ్డి, ఎన్.రాజేష్‌రెడ్డి, డి.శరత్‌చంద్రారెడ్డి, డి.భారతమ్మ తదితరులు ఉన్నారు.

అందరి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి

- సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే విజయశ్రీ

ఓజిలి, జూలై 19: సూళ్లూరుపేట నియోజకవర్గం అభివృద్ధి బాట పట్టాలంటే అందరి సహకారం అవసరమని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. ఓజిలి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా శాఖల వారీగా అధికారులు చేపట్టిన కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దారు నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

తూపిలిపాళెంను పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

వాకాడు, జూలై 19: మండలంలోని తూపిలిపాళెం సముద్రతీరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేలా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. తూపిలిపాళెం, బాలిరెడ్డిపాళెం, వాకాడుల్లో ఆయన పర్యటించారు. తూపిలిపాళెం సముద్రతీరం విశాలంగా, సహజ సిద్ధంగా ఉందన్నారు. ఆర్డీవో కిరణ్‌కుమార్ ఇప్పటికే పర్యాటక కేంద్రంగా తూపిలిపాళెం తీరాన్ని గుర్తించి నివేదిక అందించారన్నారు. అనంతరం బాలిరెడ్డిపాళెం వద్ద గత సంవత్సరం డిసెంబరులో స్వర్ణముఖినది వరద ప్రవాహానికి పొర్లుకట్టలు దెబ్బతిని పొలాల్లో ఇసుకమేటలు వేయడం, బాలిరెడ్డిపాళెం నుంచి గంగన్నపాళెం గ్రామానికి నిర్మించిన వంతెన దెబ్బతినడంపై నాయకులు డి.మధుసూదన్‌రెడ్డి, పి.పురుషోత్తంరెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి రూ.1.70 కోట్లు మంజూరైనట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం వాకాడు స్వర్ణముఖి బ్యారేజీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ సంచాలకుడు రమణప్రసాద్, జిల్లా పర్యాటకశాఖ అధికారి జయచంద్రనాథ్‌రెడ్డి, తహసీల్దారు నరసింహరావు, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, ఇరిగేషన్ డీఈ సుబ్బారావు తదితరులు ఉన్నారు.

ఎస్వీయూ రిజిస్ట్రార్‌గా భూపతినాయుడు బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 19: ఎస్వీ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు నియమితులయ్యారు. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దూర విద్యా విభాగంలో స్టాటిస్టిక్స్ ప్రొఫెసర్‌గా భూపతి నాయుడుకు యూనివర్సిటీతో సుదీర్ఘ అనుబంధం ఉంది. గుడిపాల మండలం చెరుకూరి కండ్రిగకు చెందిన ఈయన 1997లో దూరవిద్యా విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. 2006 లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2012లో ప్రొఫెసర్‌గా అప్‌గ్రేడ్ అయ్యారు. 12పీహెచ్‌డీలు, 7 ఎంఫిల్‌లకు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ఏడు పుస్తకాలు రాశారు. 30 ఏళ్ల పరిశోధన అనుభవాన్ని గడించారు. దూర విద్యా పరీక్షల కో-ఆర్డినేటర్‌గా సేవలందించారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ జాతీయ కౌన్సిల్ కార్యవర్గ సభ్యుడిగా వ్యవహరించారు. వివిధ హోదాల్లో పని చేశారు.

3 ఫిర్యాదులు.. 79 మందిపై కేసులు

- పుంగనూరు ఘటనలో పోలీసుల చర్యలు
- ఎంపీ మిథున్‌సహా 71 మంది వైసీపీ.. ఎనిమిది మంది టీడీపీ శ్రేణులపై కేసుల నమోదు

పుంగనూరు, జూలై 19: పుంగనూరు ఘటనలో రెండు పార్టీల పరస్పర ఫిర్యాదులతో 79 మందిపై కేసులు నమోదయ్యాయి. రెండు ఫిర్యాదులకు సంబంధించి 71 మంది వైసీపీ.. మరో ఫిర్యాదు మేరకు ఎనిమిది మంది టీడీపీవారిపై కేసులు నమోదు చేశారు. ఈ వివరాలను శుక్రవారం సీఐ జయరామయ్య వెల్లడించారు. వైసీపీకి చెందిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి గురువారం పుంగనూరు పట్టణం కొత్తఇండ్లులోని చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప ఇంటికి వచ్చారు. దీంతో నేతిగుట్లపల్లె ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని రైతులతో కలిసి టీడీపీ శ్రేణులు అక్కడికి వెళ్లారు. తోపులాట జరిగింది. వైసీపీ శ్రేణుల రాళ్లు, కర్రలు, కుర్చీలు, బాటిళ్లతో దాడులతో 12 మంది టీడీపీ శ్రేణులు, ఒక కానిస్టేబుల్ గాయపడ్డారు. దీంతో ఆగ్రహించిన టీడీపీ శ్రేణులు వాహనాలను ధ్వంసం చేశాయి. ఈ ఘటనకు సంబంధించి టీడీపీ, వైసీపీ శ్రేణులు అర్ధరాత్రి పోలీసులకు ఫిర్యాదులు చేయడంతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటి వద్ద ఎంపీ మిథున్‌రెడ్డి తదితరులు టీడీపీ శ్రేణులపై రాళ్లు, కర్రల దాడితో హత్యాయత్నానికి పాల్పడినట్లు గాయపడిన పుంగనూరు టీడీపీ మైనార్టీ నేత సయ్యద్ సుహేల్‌బాషా ఫిర్యాదు ఇచ్చారు. దీనిపై ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప సహా 36 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలపై కేసు నమోదు చేశారు. అలాగే, పుంగనూరు మండలం మీర్జేపల్లెకి చెందిన గాయపడిన టీడీపీ నేత ఏఎస్ఆర్‌కే ప్రసాద్‌స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్పతో కలిసి మొత్తం 35 మందిపై కేసు నమోదైంది. ఇలా వైసీపీకి చెందిన పుంగనూరు, సదుం, పీలేరు, చిన్నగొట్టిగల్లు, కేవీపల్లె, తిరుపతి తదితర ప్రాంతాలకు చెందిన 71 మందిపై హత్యాయత్నం, తదితర కేసులు నమోదయ్యాయి. తన ఇంటిపై దాడి చేసి వాహనాలు ధ్వంసం, దహనం చేశారని మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెలుగుదేశం పార్టీకి చెందిన పోలీస్ గిరి, ఎల్.నవీన్, మరో ఆరుగురు నేతలపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

28 వరకు 144 సెక్షన్

పుంగనూరులో దాడుల నేపథ్యంలో శుక్రవారం నుంచి ఈనెల 28వ తేది వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గంలో అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ముగ్గురి కంటే ఎక్కువ జనం గుమికూడరాదని జిల్లా మేజిస్ట్రేట్ సుమిత్ కుమార్ 144 సెక్షన్ అమలులో ఉంటుందని, రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులను జిల్లా ఎస్పీ, పుంగనూరు తహసీల్దార్, పుంగనూరు సీఐలకు పంపారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

అభివృద్ధికి సహకరించండి: ఆదిమూలం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం, జూలై 19: మండలాభివృద్ధికి అధికారులు సహకరించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. కేవీబీపురం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మునిలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం మండల సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో రైతులకు ఎరువులు, విత్తనాల పంపిణీలో జాప్యం లేకుండా చూస్తామన్నారు. అదేవిధంగా పీహెచ్‌సీల్లో ఆధునిక సదుపాయాలు కల్పించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాగా, ఎంపీపీ భర్త నందకుమార్ సమావేశానికి హాజరుకావడం పట్ల టీడీపీ నాయకులు అభ్యంతరం చెప్పారు. తాను సలహాదారునని, అనుమతించాలని నందకుమార్ కోరినా అధికారులు అంగీకరించకుండా అతనిని బయటకు పంపించారు. అనంతరం ప్రభుత్వం సరఫరా చేసిన కందిపప్పు, బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీరాములునాయక్, ఎంపీడీవో రెడ్డెయ్య, జడ్పీటీసీ మునెమ్మ, వైస్ ఎంపీపీ సరస్వతి, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేద్దాం: టీడీపీ

కేవీబీపురం: టీడీపీ నేతలు, కార్యకర్తలందరూ కలిసి మండలాభివృద్ధికి కృషి చేద్దామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు చెప్పారు. శుక్రవారం కేవీబీపురంలో టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. నాయకులతో పాటు కార్యకర్తలు వారి గ్రామాల్లో సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలు, రేషన్ దుకాణాల్లో సమస్యల గురించి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. రామాంజులు నాయుడు మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించుకుందామని చెప్పారు. తిరుపతి పార్లమెంటు తెలుగు రైతు అధ్యక్షుడు గోపీనాథ రెడ్డి, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు జయరామిరెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి, కిషోర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, కేశవులు నాయుడు, రాజారెడ్డి, బాలాజి, మణి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



తపస్మాన్ వద్ద పూజలు చేస్తున్న అర్చకులు - అర్జున వేషధారి విసిరే నిమ్మకాయల కోసం పోటీ పడుతున్న భక్తులు

వైభవంగా అర్జున తపస్సు

భక్తజనసంద్రమైన ధర్మరాజస్వామి ఆలయం

శ్రీకాళహస్తి, జూలై 19: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు వైభవంగా జరిగింది. అర్జునుడు ఘోర తపస్సు చేసి, శివునితో పోరి, తర్వాత తప్పు తెలుసుకుని ముక్కంటినుంచి పాశుపతాస్త్రాన్ని పొందడమనే ఘట్టం మహాభారతంలో ప్రాచుర్యం పొందింది. అర్జున, శివ పాత్రధారులు పద్యాలు ఆలపిస్తూ పోరుకు దిగారు. అనంతరం ఆలయ ఎదుట ఏర్పాటు చేసిన తపస్మాన్‌ను మెట్టు మెట్టుకు పద్యాలు పాడుతూ అర్జున పాత్రధారి అధిరోహించారు. ఈ ఉత్సవాన్ని చూడడానికి భక్తజనం పోటెత్తింది. అర్జునుడు మంత్రించి తపాస్మన్ నుంచి వెదజల్లే నిమ్మకాయల కోసం భక్తులు పోటీలు పడ్డారు. ఈ నిమ్మకాయలను తింటే సంతానం లేనివారికి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. అంతకుముందు అర్జునుడి ఉత్సవ మూర్తిని ఆలయం నుంచి విశేష అలంకారంలో చప్పరంపై అధిరోహించి ఊరేగింపుగా తపస్మాన్ వద్దకు తీసుకొచ్చి కొలువుదీర్చారు. ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి కర్పూర హారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఇక అర్జునడు నిమ్మకాయలు వెదజల్లే సమయంలో భక్తజనం కంచెపైన పడి తోపులాటలకు తావులేకుండా అధికారులు పకడ్బందీ ప్రణాళిక అమలు చేశారు. రెండంచెలుగా కంచె ఏర్పాటు చేయడంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా భక్తులు సాఫీగా నిమ్మకాయలను పట్టుకునేందుకు పోటీలు పడ్డారు. నిమ్మకాయలు విసిరే సమయంలో వర్షపు జల్లులు కురుస్తున్నప్పటికీ భక్తుల్లో ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, ఆలయ అధికారులు, పలువురు ప్రముఖులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకారంలో అర్జునుడు

గురుకుల పాఠశాలను పరిశీలించిన అధికారులు

సత్యవేడు, జూలై 19: సత్యవేడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం అధికారులు పరిశీలించారు. ఫ్రైడే - డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో రవి ఆధ్వర్యంలో అధికారుల బృందం పాఠశాలలో పర్యటించి పరిశుభ్రత, వసతులపై పరిశీలించి, విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. పాఠశాల వాటర్ ట్యాంక్ పరిసరాల్లో పిచ్చిచెట్లు పెరిగి భయానకంగా ఉందని విద్యార్థినులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పిచ్చిమొక్కలను తొలగించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వారికి చెప్పారు. అలాగే మండలంలోని దాసుకుప్పం సచివాలయ పరిధిలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గుణశేఖర్ ఆధ్వర్యంలో డ్రైడే-డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల వద్దకు వెళ్లి వివిధ పాత్రల్లో నిల్వ ఉంచిన నీటిని పారబోసి ఎండబెట్టారు. ట్యాంకులను శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, సూపర్ వైజర్ నాగజ్యోతి, పవన్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



తాగునీటి ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపీడీవో

నీరువాయిలో ఆయిల్‌పామ్ ప్లాంటేషన్

పిచ్చాటూరు, జూలై 19: మండలంలోని నీరువాయి గ్రామంలో శుక్రవారం ఉద్యానవన శాఖ అధికారి రాధారాణి ఆధ్వర్యంలో పామాయిల్ మొక్కల పెంపకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పామాయిల్ సాగు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందే లాభసాటి పంటని అన్నారు. వ్యవసాయ సిబ్బంది ప్రశాంత్, మురళి, షణ్ముఖ రాజా, వెంకటముని, రవి, రైతులు పాల్గొన్నారు.



పామాయిల్ మొక్కలు నాటుతున్న ఉద్యానవన శాఖ అధికారి రాధారాణి తదితరులు

ప్రభుత్వ విధానాలు పాటించండి

శ్రీకాళహస్తి, జూలై 19: ప్రభుత్వ విధివిధానాలకు అనుగుణంగా మెడికల్ షాపులు నడపాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలోని కొత్తపేటలో గల శ్రీరామమందిరంలో శుక్రవారం కెమిస్ట్, డ్రగ్గిస్ట్, మెడికల్ షాపు యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రగ్ లైసెన్స్, ఫార్మసిస్ట్ సర్టిఫికెట్‌ను దుకాణం వద్ద ప్రదర్శించాలని స్పష్టం చేశారు. అలాగే బిల్‌బుక్, షెడ్యూల్-హెచ్ రిజిస్టర్ ప్రతి ఒక్కరూ తప్పక వినియోగించాలన్నారు. వైద్యుల సిపార్సు లేనిదే నార్కోటిక్ డ్రగ్స్ విక్రయించకూడదన్నారు. కార్యక్రమంలో జిల్లా కెమిస్ట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రాము, శ్రీకాళహస్తి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదనరావు, సభ్యులు, నంద, అమర జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో పలువురు ప్రముఖులు



గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణ, జస్టిస్ హిమ కోహ్లీ

శ్రీకాళహస్తి, జూలై 19: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిమ కోహ్లీ, రాష్ట్ర ఎండోమెంట్ కమిషనర్ సత్యనారాయణ శుక్రవారం వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. వారికి ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. జస్టిస్ హిమకోహ్లీ ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, స్థానిక న్యాయమూర్తులు శ్రీనివాస్‌నాయక్, దర్మారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వరదయ్యపాళెం, జూలై 19: వరదయ్యపాళెం మండలం కడూరు పంచాయతీ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ శివప్రసాద్ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, స్తంభాల వద్ద చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా కడూరు, తాగేలి, నేలటూరు, సీఆర్‌సీకండ్రిగ, రామకృష్ణాపురం గ్రామాలకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఫ్యాప్టో కార్యవర్గం ఎన్నిక

ఏర్పేడు, జూలై 19: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఏర్పేడు మండల కార్యవర్గ ఎన్నిక శుక్రవారం జరిగింది. గౌరవాధ్యక్షుడుగా ఎం.రామాంజనేయులు, అధ్యక్షుడుగా ఇ.రాజు రామచంద్రరావు, ఉపాధ్యక్షులుగా నిరంజన్, ఆదినారాయణ, హరిబాబు, ప్రధాన కార్యదర్శిగా సి.గురవారెడ్డి ఎన్నికయ్యారు. అలాగే కార్యదర్శులుగా దేవరాజులు, ఉష, శాంతి, మధుసూదన రాజు, చెంచు బత్తెయ్య, రత్నకుమార్, కోశాధికారిగా రామకృష్ణయ్యను ఎంపిక చేశారు.



రామచంద్రరావు, గురవారెడ్డి

బడి మానేసిన పిల్లలకు అడ్మిషన్

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 19: మండలంలోని గాజులపెళ్లూరు పంచాయతీ, ఆదిలక్ష్మయ్య గిరిజన కాలనీలో బడి మానేసిన పిల్లలను ఎంఈవో మునిసుబ్రహ్మణ్యం శుక్రవారం పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ప్రకారం బడిఈడు పిల్లలందరూ పాఠశాల్లోనే ఉండాలన్నారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, జూలై 19: వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూల మూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూల మాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు.

ఘనంగా శుక్రవార ఉత్సవం

శ్రీకాళహస్తి, జూలై 19: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షణ చేయించి తిరిగి కొలువుతీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మెరుగైన వైద్యసేవలే లక్ష్యంగా పనిచేయండి

శ్రీకాళహస్తి, జూలై 19: మెరుగైన వైద్యసేవలే లక్ష్యంగా వైద్యులు పనిచేయాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ కోరారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఓపీ విభాగంలో రోగులకు అందుతున్న సేవలు, పారిశుధ్య పనులను పరిశీలించారు. చేతుల శుభ్రం చేసుకునే హ్యాండ్‌వాష్ వద్ద కుళాయి విరిగిపోయిన దృశ్యాన్ని ఆమె గుర్తించారు. ఆస్పత్రి నిర్వహణపై నిర్లక్ష్యం తగదని హితవు పలికారు. కాలం చెల్లిన గ్లౌజులను వినియోగిస్తున్నట్లు గుర్తించి నిలదీశారు. కాలం చెల్లిన మందులను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని సూచించారు. ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించి యంత్రాలు, సామగ్రిని పరిశుభ్రంగా నిర్వహించుకోవాలని సూచించారు. రెండు అంతస్తులు లిఫ్ట్ లేకపోవడంతో మెట్ల ద్వారా ఆమె వార్డులను పరిశీలించారు. ఈ క్రమంలో బీపీ తగ్గి స్వల్పంగా అస్వస్థతకు గురయ్యారు. అక్కడే చికిత్స పొంది యధావిధిగా కోలుకున్నారు. గత ప్రభుత్వం రూ.12కోట్లు నిధులను దుర్వినియోగం చేసి కనీసం లిఫ్టును కూడా నిర్మించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పట్టణంలోని బాబుఅగ్రహారం ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన మెను, నాణ్యతపై ఆరా తీశారు. పాఠశాలలో సమస్యలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న బృందమ్మ

వరదయ్యపాళెం ఇన్‌ఛార్జి ఎస్‌ఐగా ఓబయ్య

వరదయ్యపాళెం, జూలై 19: వరదయ్యపాళెం ఇన్‌ఛార్జి ఎస్‌ఐగా నాగలాపురం ఎస్‌ఐ టి.ఓబయ్య నియమితులయ్యారు. ఇక్కడి ఎస్‌ఐ ప్రతాప్‌ను వీఆర్‌కు పంపిస్తూ శుక్రవారం జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను వెంటనే ఎస్‌ఐను రిలీవ్ చేయాలని సత్యవేడు సీఐను ఆదేశించారు.

కుష్టువ్యాధిపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 19: మండలంలోని లక్ష్మీపురం గిరిజన కాలనీలో శుక్రవారం ఆరోగ్య కేంద్రం సిబ్బంది, విద్యార్థులతో కలిసి కుష్టువ్యాధిపై నివారణపై ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ దివాకర్ మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందంగా ఉన్న మెరిసే జిడ్డు చర్మం, చెవులు, వీపుపై నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, కాళ్లు, చేతులు తిమ్మిర్లు వంటి లక్షణాలు ఉంటే ఆరోగ్య కార్యకర్తలకు చూపించాలని సూచించారు. కుష్టువ్యాధి నివారణకు ఉచితంగా మందులు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 19: పరిసరాలతో పాటుగా వ్యక్తిగత శుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని కార్యదర్శి ఇందిరమ్మ అన్నారు. బుచ్చినాయుడు కండ్రిగలో శుక్రవారం డ్రైడేను పురస్కరించుకుని వీధుల్లో మురుగు కాలువలు శుభ్రం చేసి క్లోరినేషన్ చేశారు. అనంతరం గ్రామంలో పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పుస్తకాల పంపిణీ

వరదయ్యపాళెం, జూలై 19: బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురుదేవ్ జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప చేతల మీదుగా వరదయ్యపాళెం మండలం ఇందిరానగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు సరస్వతి, గున్నయ్య, ప్రధానోపాధ్యాయుడు శ్యామ్, జిల్లా యువమోర్చా కార్యదర్శి డిల్లీ ప్రకాష్, పురుషోత్తం, తాగ్యరాజు, జనసేన నాయకులు తడ శ్రీను, సిద్ధులయ్య, తిలక్‌బాబు, దామోదర రెడ్డి, ఏఎస్‌ఐ షణ్ముగం, హరి, టీడీపీ నాయకులు రమణయ్య, శ్రీనివాసులు నాయుడు, గ్యాస్ వెంకటేష్, శేఖర్, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాపానాయుడుపేట రోడ్డును బాగు చేయండి

ఏర్పేడు, జూలై 19: రేణిగుంట - పాపానాయుడుపేట రోడ్డు గుంతలమయంగా ఉందని, అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని రోడ్లు, భవనాలశాఖ ఈఈ మధుసూదన్ రావుకు అంబేడ్కర్ బహుజన సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. అంబేడ్కర్ స్టార్‌కృష్ణ మాట్లాడుతూ కుక్రకాల్వ నుంచి పాపానాయుడుపేట, గుడిమల్లం, మునలిపేడు వరకు రోడ్డు చాలా అధ్వానంగా ఉందన్నారు. ఈ మార్గంలోని గుడిమల్లం ఆలయంలో ఈనెల 30న ఆడికృత్తిక ఉత్సవాలు జరగనున్నాయని, భక్తులకు ఇబ్బందులు లేకుండా రోడ్డును బాగు చేయాలని కోరారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా! నా కక్షిదారు మేసర్స్ శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీకాళహస్తి బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన భోగట్టా ప్రకారము ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి తొట్టంబేడు మండలం మరియు గ్రామ పంచాయితీ [illegible], [illegible] కండ్రిగ, ఎల్.ఐ.సి. కాలనీ, ప్లాట్ నెం. 23లో యుండు చిన్నాపట్టు సుమశేఖర్ గారి భార్య రేఖ గారికి చెందినదనియు సదరు ఆస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని సదరు చిన్నాపట్టు సుమశేఖర్ గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి అప్పులు, దావాలు, క్లైయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలోగా ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియ జేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యులు కారు.
షెడ్యూలు : చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రి.జి., తిరుపతి, తొట్టంబేడు సబ్ డి., కె.వి.బి.పురం మండలం, [illegible] సర్వే గ్రూపులో చేరిన [illegible]కండ్రిగ గ్రామ పొలంలో 1) సర్వే నెం. 270-4కు, పూంజ పూరా ఎ.1.81 సెం.లో ఎ.0.60సెం.కు మార్పు 0.243హె. ఇందుకు హద్దులు : తూర్పు లేట్ చిన్నపట్టు [illegible] భూమి, పడమర : పిచ్చాటూరు - శ్రీకాళహస్తి రోడ్డు, ఉత్తరం : మునివేలు భూమి, దక్షిణం చెరువుకట్ట, ఈ మధ్య ఎ. 0.60 సెంట్లు భూమి మాత్రం. 2) సర్వే నెం. 272/3బి లో ఎ. 0.13 సెంట్లు లేక 0.053 హెక్టార్లు. ఇందుకు హద్దులు : తూర్పు : పిచ్చాటూరు-శ్రీకాళహస్తి రోడ్డు, పడమర : కంచర్లపాళెం మోహనశెట్టి భూమి, ఉత్తరం : చెంచయ్య శెట్టి భూమి, దక్షిణం : వెంకటేశ్వర్లు భూమి, ఈ మధ్య ఎ. 0.13 సెంట్లు భూమి. పై 1.2 ఐటములు మొత్తం విస్తీర్ణం ఎ. 0.73 సెంట్లు భూమి మాత్రం
జి.వి.సుబ్బయ్య, బి.ఎ.,బి.ఎల్., అడ్వకేట్, డో.నెం.8-114/2 రాయల్ నగర్, ఆర్.సి.రోడ్డు, తిరుపతి. సెల్ : 94402 02564

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా! నా కక్షిదారు మేసర్స్ శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీకాళహస్తి బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన భోగట్టా ప్రకారము ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి శ్రీకాళహస్తి టౌన్, గాంధీ వీధి, ఇం.నెం. 6-428లో యుండు లేట్ కోన బత్తయ్య గారి కుమారుడు కోన రామారావు గారికి చెందినదనియు సదరు ఆస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని సదరు కోన రామారావు గారి భార్య కె.శ్రీలక్ష్మి గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి అప్పులు, దావాలు, క్లైయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలోగా ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియ జేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యులు కారు.
షెడ్యూలు : తిరుపతి డిస్ట్రిక్ట్, శ్రీకాళహస్తి సబ్ డిస్ట్రిక్ట్, శ్రీకాళహస్తి మునిసిపాలిటి, శ్రీకాళహస్తి టౌన్, సర్వే నెంబరు. 289, గాంధీ వీధి, వార్డు నెం. 06, పాత డోర్ నెం.6-332, పాత అసెస్మెంటు నెం. 9828, ప్రస్తుత డోర్ నెం.6-428, ప్రస్తుత అసెస్మెంటు నెం. 101101 1141గల ఇల్లు స్థలమునకు హద్దులు, కొలతలు వివరం - తూర్పు : కోన దామోదరం గారి ఇల్లు, దక్షిణం : [illegible] గారి ఇల్లు, పడమర : [illegible] గారి ఇల్లు, ఉత్తరం : సందు వీధి. ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమరకు (ఇరువైపులా) అడుగులు 18/2 కు మీటర్లు 5.63 ఉత్తరం నుండి దక్షిణమునకు (ఇరువైపులా) అడుగులు 311/2 కు మీటర్లు 9.60 వెరశి 5823/4 చ.అ.లు లేదా 64.75 చ.గ.లు లేదా 54.13 చ.మీ.లు గల ఖాళీ జాగాయున్నూ ఇందులో కట్టియుండు 5823/4 చ.అ.లు గల ఏ.సి.సి. రేకుల ఇల్లున్నూ సదరు ఇంటికి అమర్చిన తలుపులు, ద్వారబంధరేములు, వాస్తువాల్‌టీ, కరెంటు సర్వీసుతో సహా. ఈ ఆస్తి శ్రీకాళహస్తి మునిసిపాలిటి పరిధిలో కలదు.
జి.వి.సుబ్బయ్య, బి.ఎ.,బి.ఎల్., అడ్వకేట్, డో.నెం.8-114/2 రాయల్ నగర్, ఆర్.సి.రోడ్డు, తిరుపతి. సెల్ : 94402 02564

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా! నా కక్షిదారు మేసర్స్ శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీకాళహస్తి బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన భోగట్టా ప్రకారము ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి తిరుపతి జిల్లా, కె.వి.బి.పురం మండలం, తిమ్మసముద్రం, ఇం.నెం. 1-45లో యుండు బొర్రా మల్లికార్జున రెడ్డి గారి కుమారుడు బొర్రా భావేష్ రెడ్డి గారికి చెందినదనియు సదరు ఆస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని సదరు బొర్రా మల్లికార్జున రెడ్డి గారి భార్య బొర్రా మాధవి గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి అప్పులు, దావాలు, క్లైయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలోగా ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియ జేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యులు కారు.
షెడ్యూలు : తిరుపతి జిల్లా, తొట్టంబేడు సబ్.డి., కె.వి.బి.పురం మండలం, తిమ్మసముద్రం సర్వేగ్రూపులో చేరిన తిమ్మసముద్రం గ్రామ పొలంలో సర్వే నెం. 15/6 పూరా పుంజ ఎ.0.86 సెం.లలో గల ఖాళీ స్థలమునకు హద్దులు - తూర్పు : రోడ్డు, పడమర : పి. భోగవతి ఖాళీ స్థలం, దక్షిణం : ఎం.బాలాజీ ఇల్లు మరియు ఖాళీ స్థలం, ఉత్తరం : పి.బాలకృష్ణయ్య ఇల్లు మరియు ఎం. రామలింగయ్య ఇల్లు. ఈ మధ్య కొలతల వివరం: తూర్పు పార్శ్వం అ.72.5 లు మార్పు 22.09 మీ., పడమర పార్శ్వం అ.69 లు మార్పు 21.03 మీ., ఉత్తరం పార్శ్వం అ.154.5 లు మార్పు 47.09 మీ., దక్షిణ పార్శ్వం అ.121.6 లు మార్పు 37.08 మీ. వెరశి చ.అ.9763.5 లుకు మార్పు చ.గ. 1084.83 లు మార్పు 906.91 చ.మీ. గల ఖాళీ స్థలం మాత్రం..
జి.వి.సుబ్బయ్య, బి.ఎ.,బి.ఎల్., అడ్వకేట్, డో.నెం.8-114/2 రాయల్ నగర్, ఆర్.సి.రోడ్డు, తిరుపతి. సెల్ : 94402 02564